# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా
## The Bombay Andhra Mahasabha & Gymkhana

ఆగస్టు - సెప్టెంబర్ 2008

తెలుగు భాషా, సాహితీ, సంస్కృతి, కళల, క్రీడల వార్తా విశేషాల.. **దర్పణం**



కన్నీళ్ళు లేని రేపటి “భారతాన్ని” కాంక్షిస్తూ...




కరుణాకటాక్షాల్ని ఆకాంక్షిస్తూ ...




'పరివర్తన' చిన్నారులతో ఆంధ్ర మహాసభ కార్యవర్గం

# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా
## The Bombay Andhra Mahasabha & Gymkhana


10-C, Lakhamsi Napoo Road, Dadar (E), Mumbai - 400014. Tel. 24144377 / 24144388, Fax: 24119832.

## మా మాట

**న**మస్కారం!

**గ**త నెల **దర్పణం** కొంచెం ఆలస్యం కావడంపట్ల, సభ్యులు, పాఠకులు చూయించిన ఆత్రుత మమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. **దర్పణం** మీ అందరి హృదయాల్లోకి ఇంతగా చొచ్చుకు పోయినందుకు ఆనందంగానూ వుంది. అయితే అనివార్య కారణాలవల్ల ఆగష్టు, సెప్టెంబర్ సంచికల్ని కలిపి తీసుకొస్తున్నాం. ఇహ ముందు ప్రతి సంచిక నెల మొదటి వారంలో మీ చేతుల్లో వుండే విధంగా రూపొందించేందుకు ప్రయత్నం చేస్తామనీ విజ్ఞప్తి చేస్తున్నాం. 15 ఆగష్టు, స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా,సత్తెనపెల్లికి చెందిన మూగ, చెవిటి, మానసిక వికలాంగుల, నృత్య గాన వినోద కార్యక్రమానికి మీరు చూయించిన స్పందన మరిచిపోలేనిది. ఆ పిల్లలకు చెందిన సంస్థ “పరివర్తన’ కు గుండె తడితో స్వచ్ఛందంగా మీరు అందించిన విరాళాలు మానవీయతను ప్రతిఫలించే మహోన్నత క్షణాలు.

మిమ్మల్ని మేము కోరేదేమిటంటే ....

మంచి కార్యక్రమాలు సూచించండి, వ్యక్తిగత,ప్రాంతీయ వివక్షకు చోటులేని కార్యక్రమాల గురించి మాకు వివరించండి. సభ్యుల ఆకాంక్షలకనుగుణంగా కార్యక్రమాలు రూపొందించడమే మా కర్తవ్యంగా భావిస్తాం. అట్లాగే, **దర్పణా**నికి మీ రచనలు పంపండి. కాకలు తీరిన రచయితలే రాయలనీ ఏమీ లేదు.

**మూల సిద్ధారెడ్డి**
అధ్యక్షుడు

**భోగ సహదేవ్**
ప్రధాన కార్యదర్శి


సారథ్యం : **మూల సిద్ధారెడ్డి**

ప్రధాన సంపాదకులు : **భోగ సహదేవ్** సమన్వయ సంపాదకులు : **సంగెవేని రవీంద్ర**


ఇందులో...

- **స్పందనలు..**
- **జరిగిన కార్యక్రమాలు**
- **జరుగబోవు కార్యక్రమాలు**
- **కవితలు, కథలు**
- **బాల దర్పణం**
- **హాస్యవల్లరి**
- **వింతలు విశేషాలు**
- **ప్రత్యేక వ్యాసాలు**

**ఇంకా.. ఎన్నో... ఎన్నెన్నో...**




ఈవెంట్ మేనేజర్స్

**మట్టి జనార్దన్**
**కె. భాస్కర్ రెడ్డి**
**డా॥ విజయ సారథి**
**బి. ఎస్.రావు (శేషు)**

సహసంపాదకులు

**నడిమెట్ల యెల్లప్ప**
**గట్టు నర్సయ్య**
**దాస చంద్రకాంత్**
**శ్రీమతి టి. కమల కుమారి**

# గతమాసపు దర్పణం పై పాఠకుల స్పందన ..



## గొప్ప సేవ

నేను ఆంధ్ర మహా సభ్యున్ని కాకపోయినప్పటికీ, దర్పణాన్ని బాగా తీసుకువస్తున్నందుకు అభినందన లేఖ రాయకుండా ఉండలేకపోతున్నాను. మీరు ప్రచురించకపోయినా మంచిదే కానీ, దర్పణాన్ని మాత్రం మరింత బాగా తేవాలనీ, సంపాదకుల్ని కోరుకుంటున్నాను. ప్రతి నెల ఒక గొప్ప మనిషి గురించి ప్రచురించడం ఆకట్టుకుంది. దర్పణంతో తెలుగువారికి గొప్ప సేవ చేస్తున్న ఆంధ్రమహాసభ మేనేజ్‌మెంట్‌కు కృతజ్ఞతలు.

.... అడపా మోహనకృష్ణ

## చదివించేలా ఉంటుంది

గత ఆరు నెలలుగా దర్పణాన్ని చదువుతున్నాను. చాలా బాగా తీసుకొస్తున్నందుకు అభినందనలు. మొదట్లో భాషాపరంగా కొంచెం కఠినమనిపించినా, చదివించేలా ఉంటోంది. పిల్లలకు, మహిళలకు, ఉపయోగపడే శీర్షికలతోపాటు, వివిధ అంశాలపై ప్రచురిస్తున్న వ్యాసాలు కూడా చాలా బాగుంటున్నాయి. దర్పణాన్ని మరింత ఆకర్షణీయంగా, విజ్ఞాన దాయకంగా తీసుకురావాలనీ ఆకాంక్షిస్తూ....

... పోతు రాజారాం

## ఇన్‌ఫర్మేటివ్‌గా ఉండాలి

దర్పణంలోని వ్యాసాలు, జోకులు, కథలు చాలా బాగుంటున్నాయి. ముంబాయిలో తెలుగు మాస పత్రిక వెలువడుతుందనీ, మన స్వరాష్ట్రంలో చెప్పుకునేలా ఉంది. యింకా ఎక్కువ ఇన్‌ఫర్మేటివ్‌గా ఉండేలా శ్రద్ధ వహించండి. మంచి కార్యక్రమాలతో పాటు మంచి పత్రిక అందిస్తున్న సంపాదకవర్గం, కార్యనిర్వాహక వర్గంకు అభినందనలు.

... టి. గంగాధర్ రెడ్డి.

## మహారాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించాలి

"దర్పణం" ఆంధ్ర మహాసభ కార్యక్రమాలకు దర్పణంగా భాసిల్లుతోంది. సమకాలిక విషయాలపై పిల్లలకు, పెద్దలకు, ఉపయోగపడే శీర్షికలు నిర్వహించినట్లయితే బావుంటుంది. పండుగలను, మహారాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే ఆర్టికల్స్ ప్రచురించండి. దర్పణాన్ని మహాసభ ముఖ పత్రికగా తీసుకు వస్తున్నందుకు ధన్యవాదములు.

.... జిందం రాందాసు

## సంపూర్ణ మాస పత్రిక

"దర్పణం" విజ్ఞానదాయకంగా ఉంటుంది. కథలు జోక్స్ కూడా బాగుంటున్నాయి. ఆంధ్రమహాసభ న్యూస్‌లేటర్‌గా గాక, సంపూర్ణ మాసపత్రికలా ఉంటోంది. ముంబాయిలో తెలుగువారు జరుపుకుంటున్న కార్యక్రమాలకై ఒక పేజీ కేటాయిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. తెలుగు చదవడం ఇష్టపడని వారితో కూడా తెలుగు చదివించేలా దర్పణాన్ని తీసుకొస్తున్న సంపాదక వర్గానికి నా కృతజ్ఞతలు..

... గూల్లె గంగాధర్.




### పచ్చగా

**రా**ణి : నాకు చాలా బాధగా వుంది వదినా! ఏం చేయాలో తోచడం లేదు

రేణుక : మీ ఇంట్లో అందరూ బాగానే వున్నారు. మీ ఆర్థిక పరిస్థితి కూడా బాగుంది. ఇంకెందుకు బాధ ?

రాణి : మేం పచ్చగా ఉండడం ఇరుగుపొరుగు వాళ్ళంతా చూడలేకపోతున్నారు.



రేణుక : అదేం విడ్డూరం. నువ్వు నలుపు, మీ ఆయన నలుపు. మీ పిల్లలు నలుపు. మరి మీరు పచ్చగా వుండటం, మిమ్మల్ని చూసి అందరూ ఓర్వలేకపోవడం ఏమిటి ?

### శిక్ష

**"హ**లో! రామారావు గారు వున్నారండీ?'' ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి అడిగాడు.



"నేనే రామారావును. విషయం చెప్పండి"

"మీ భార్యను కిడ్నాప్ చేశాం. మీరు అర్జంట్‌గా మూడు లక్షలు తీసుకవచ్చి మాకు ఇవ్వండి. లేకపోతే మీకు చాలా పెద్ద శిక్ష విధించవలసి వస్తుంది."

"నేను మీకు డబ్బు ఇవ్వను. ఏ శిక్ష విధిస్తారో విధించండి." అన్నాడు రామారావు.

"మీ భార్యను క్షేమంగా తీసుకువచ్చి మీ ఇంట్లో వదిలేస్తాం".

### స్ట్రిక్ట్



**"మా** బాస్ చాలా స్ట్రిక్ట్. ఆఫీసులో ఎవరైనా లంచం తీసుకున్నట్టు తెలిస్తే అస్సలు ఊరుకోడు" చెప్పాడు క్లర్క్. "మంచిదేకదా! అవినీతిని నిర్మూలించాలనే ఉద్దేశంతో వెంటనే సస్పెండ్ చేస్తాడా? అడిగాడు వెంకటరావు.

"లేదు. ఆయన వాటా ఆయన వెంటనే తీసుకుంటాడు" అన్నాడు క్లర్క్.

### బయటకు



**చిం**టు : డాడీ.... మా ఫ్రెండ్స్ వచ్చారు. కాస్సేపు బయటకు వెళ్ళి ఆడుకొని వస్తాను. ఎప్పుడూ ఇంట్లోనే కూర్చోమంటావు.

తండ్రి : ఎప్పుడూ ఆటలేమిటి ? నోరు మూసుకు కూర్చుని ముందు ముక్కవేయి.

### బద్ధకం



''**డా**క్టర్! నా భార్య ప్రసవించిందా?''

అడిగాడు ఆత్రుతగా వెంకట్.

"ఇంకాలేదండీ. టైము వుంది"అన్నాడు డాక్టర్.

"మీరు కాస్త అప్పుడప్పుడు చెబుతూ వుండండి డాక్టర్ ! ప్రసవించమని. దానికి ఏ పని చేయాలన్నా బద్ధకం" చెప్పాడు వెంకట్.

### ఎంత దూరం ?



**తు**ఫానులో చిక్కుకున్న పడవలో ఇద్దరు వ్యక్తులు ఈ విధంగా మాట్లాడుకుంటున్నారు. నేల ఎంత దూరంలో ఉంటుంది ? ఒక కిలోమీటరు. అయితే నీటిలోకి దూకేసి ఈదుదాం. ఎటువైపు ఈదాలి ? కిందకి. కిలోమీటరు వెళ్తే నేల తగిలే అవకాశం ఉంది.

### అందుకే



**"ట్యూ**షన్ అయిపోయిన వెంటనే చీకటి పడకుండా ఇంటికిరా తల్లీ!" అనిచెప్పాడు తండ్రి రమకి.

"ఎందుకు అంత భయం నాన్నా! నేనేమైనా చిన్నపిల్లనా?" ప్రశ్నించింది రమ. "కాదుగాబట్టే నాకంత భయం తల్లీ" అన్నాడు తండ్రి.

సాహితీ దర్పణం

కవిత

## టియర్ బ్యాంక్

అంతా పొడి... పొడి....
ఎండిన గుండె పొలాలు
చూపుల్లో నవ్వుల్లో ఎక్కడా
తడి జాడల్లేవ్...
వర్షాలెక్కువే..!
ధనకనక నెత్తుటి వర్షాలకు తోడుగా
ఆకాంక్షల లావా ప్రవాహాలు....
అయితే... తడెక్కడా....

ఎక్కడ పొడిచినా రక్తం ధారలే...
కన్నీటి చెలిమెలెక్కడా...?
ఎక్కడ చూసిన ధనబండారాలే
కరుణార్ద్రతహృదయాలెక్కడా..?
కురిసిన వర్షం చుక్కలు
కళ్ళముంగిళ్ళలో తడి 'కడవ'లవకుండా
బొట్లుబొట్లుగా కారే నిరాశనిస్పృహల
ఇసుక ప్రవాహాలు....

గ్లోబల్ వార్మింగ్...
అవును....ఛై..!
వాటెబౌట్ హ్యూమన్ బీయింగ్.....?
బ్లడ్‌బ్యాంక్...ఐ బ్యాంక్, స్పెర్మ్ బ్యాంక్
స్విస్ బ్యాంక్‌లు కాదు...
కన్నీటి కరువుతో బీడువారిన
మానవీయ గుండెల్ని కదిలించి కరిగించే
బ్యాంకులు రావాలి....
పొడి బారిన మనసు పొరల్ని తడిపే...
'టియర్ బ్యాంకు'లు కావాలి....

**-సంగెవేని రవీంద్ర**
**సెల్ : 09987145310**

**మీకు తెలుసా..?**

**సంఖ్యామానం కనిపెట్టింది, సున్న కనుగొన్నది 'ఆర్యభట్ట' - మన భారతీయుడే ..!**






## బంగారు బాలలు

- బెహరా ఉమామహేశ్వర రావు



బంగారు బాలలు
నల్లని మబ్బులు
చిటపట చినుకులు
కురిసే వానలు
తడిసే నేలలు
నిండేచెరువులు
పారే ఏరులు
చక్కని బావులు
చిక్కగ నిండెను



తెల్లని ఎద్దులు
దున్నే దుక్కులు
పచ్చని పొలములు
పండే పంటలు
ఇంటింటా గాదెలు
గాదంతా గింజలు
ఇంటింటా వంటలు
నిండాయి పొట్టలు



చక్కని ఆటలు
చిక్కని మాటలు
హోయనే పాటలు
ముత్యాల మూటలు
బాలల గంతులు
వాడంతా వెలుగులు
బంగరు బాలలు
భావి నేతలు.

మీమీ భావాల అంతరంగతరంగాలకు అక్షర రూపం యివ్వండి.

ప్రచురించి, ప్రోత్సాహించేందుకు మేము సిద్దంగా ఉన్నాము. తెలుగువారి ఆత్మబంధువుగా దర్పణాన్ని తీర్చిదిద్దేందుకు మాకు సహకరించండి. మీ సూచనలు, మీ రచనలు మాకు శిరోధార్యం అవుతాయనీ తెలుపుతూ....

-సంగెవేని రవీంద్ర,
సమన్వయ సంపాదకుడు

# చాలా ప్రమాదం

ఇవ్వాళేం చేశావు ?
మామూలు పనులే..

ఎవరితో మాట్లాడావు ?
ఎప్పుడూ మాట్లాడేవాళ్ళతోనే..

ఏం చదివావు?
రోజూ చదివే వార్తల్నే.

ఎక్కడికి వెళ్ళావు ?
ఎప్పుడూ వెళ్ళే చోటుకే.

ఏం తిన్నావు ?
మామూలు భోజనమే.

ఏం ప్రోగ్రామ్‌లు చూశావు ?
ఎప్పుడూ చూసే వాటినే.

ఏం ఆలోచించావు ?
మామూలు విషయాలే.

✶ ✶ ✶

ఒక్కోరోజు జీవితం ఇలాగే గడుస్తుంది.
ప్రతిరోజూ అలాగే గడిస్తే మాత్రం ప్రమాదం.




# రాళ్ళకు దణ్ణం

**రా**యి కనిపించినప్పుడల్లా ఆగి దణ్ణం పెడుతున్నాడు ఓ యువకుడు. "ప్రతి రాయీ దేవుడనుకుంటే ఎలా?" అన్నాడు దీన్నంతా చూస్తున్న ఒక పెద్దాయన.

"ప్రతి మనిషినీ దేవుడనుకునే కంటే ఇది నయంకదా....." అన్నాడా అబ్బాయి.

"అసలు దేన్నో దాన్ని దేవుడని ఎందుకు అనుకోవాలి ?" వదిలిపెట్టలేదు ఆ పెద్దాయన.

"అదేమిటి? దేవుడున్నాడని అనుకోవడంలో తప్పేముంది?" ఆశ్చర్యపోతూ అన్నాడాయువకుడు.



"నీకిప్పుడు దేవుడితో అవసరం ఏమొచ్చింది ?" వానలు కురుస్తున్నాయి. పంటలు పండుతున్నాయి. హాయిగా ఉద్యోగాలు చేస్తూ తిని తిరుగుతోంది మీ తరం అంతా. ఇంకా నీకు వచ్చిన కష్టమేమిటి ?" అడిగాడు ఆ పెద్దాయన.

" వానలు కురవడం లేదు. పంటలు పండడం లేదు. మేము హాయిగా ఉద్యోగాలు చేసుకోవడం లేదు. తిని తిరిగేంత ఖాళీ మా తరానికి అసలే లేదు. అయినా వాటికీ దేవుడికి సంబంధం ఏమిటి?" యువకుడు నిలదీస్తున్నట్టు అడిగాడు.

"నేననేదీ అదే. నీ కష్టసుఖాలు వేటితోనూ దేవుడికి సంబంధం లేదనే నేనూ చెపుతున్నాను." ముఖం కాస్త ప్రసన్నంగా పెట్టుకుని చెప్పాడాయన.

"మరి మీ అభ్యంతరమేమిటి ? నేను రాళ్ళకి దణ్ణం పెట్టానే గానీ, రాళ్ళను దేవుళ్ళనుకుని పెట్టలేదు కదా" విసుగ్గా అన్నాడాయువకుడు.

"ఏమనుకుని పెట్టావు మరి.." ఈసారి కుతూహలంగా అడిగాడు పెద్దాయన.
"రాళ్ళనుకునే పెట్టాను. ఏం రాళ్ళకి దణ్ణం పెట్టకూడదా ?"

పెద్దాయనకి నోట మాట రాలేదు.

**ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...**

## ✤ లోకోక్తులు ✤

| | | |
|---|---|---|
| **యధారాజా తథా ప్రజా** | : | రాజు ఎలా ఉంటే ప్రజలు ఆలాగే ఉంటారు. |
| **యదార్థవాదీ లోక విరోధి** | : | నిజం చెప్పేవాడు అందరికీ విరోధి అవుతాడు. |
| **వినాశకాలేవపరీత బుద్ధి** | : | వినాశకాలం దాపురిస్తే విపరీతమైన బుద్ధులు పుడతాయి. |
| **సర్వేజన సుఖినో భవన్తు** | : | సకల జనులూ సుఖశాంతులతో వర్ధిల్లాలి. |

**మీకు తెలుసా..?**

**'షట్రంజ' లేక 'అష్టపద' అనే పేర్లతో 'చెస్' ఇండియాలోనే కనిపెట్టబడినది.**



## ఏ దేశమేగినా ?

సాహితీ దర్పణం

కవిత

ఏదేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలపరా నీ జాతి నిండు గౌరవము

ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగబలమో
జనియించినాడ వీ స్వర్గఖండమున
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో
నినుమోసె యీ తల్లి కనక గర్భమున

లేదురా ఇటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి పౌరులింకెందు
సూర్యుని వెలుతురుల్ సోకునందాక
ఓడల జెండాలు ఆడునందాక

అందాకగల ఈ అనంత భూతలిని
మన భూమి వంటి చల్లని తల్లి లేదు
పాడరా నీ తెల్గు భావగీతములు
పాడరా నీవీర భావ భారతము

తమ తపస్సులు ఋషుల్ ధారవోయంగ
శౌర్యహారము రాజచంద్రులర్పింప
భావ సూత్రము కవిప్రభువు లల్లంగ
రాగ దుగ్ధము భక్తరత్నముల్ పిదుక

దిక్కుల కెగదన్ను తేజమ్ము వెలుగ
రాళ్ళ తేనియలూరు రాగాలు సాగ
జగముల నూగించు మగతనం బెగయ
సౌందర్యమెలబోయు సాహిత్యములర

**- రాయప్రోలు సుబ్బారావు**

## రండి రండి

సాహితీ దర్పణం

కవిత

రండి, రండి, ఆంధ్రమహాసభలో
కవి దిగ్గజాల వీరవిహారం
'మల్లికార్జును'ని మాటల
తోరణాల కళ-కలారవం

అతివల ఆవేదనలకు అద్దంపట్టే (నాతిచరామి)
'నరేంద్రుల' వారి నవలా ప్రవాహం
'అంబల్ల' కథల వాస్తవికతల
వాక్ప్రవాహం

'రవీంద్రుల' రసమయ
కవితా సిరుల సుమాసౌరభం
'సహదేవు'ని గళ కళల
గాన మాధుర్య రసామృతం

వీరేగాక.. ఇంకెందరో..
కళాకోవిదులకు, కళాకారులకూ
పట్టంగట్టి చేయూతనిచ్చిన
'సిద్ధారెడ్డి' మనోకళా "దర్పణం"
చూడండి, చూసి
మీలో మిమ్మల్ని గుర్తించండి
కవులుగా, కళాకారులుగా,
వారిలో ఒకరు కండి
రండి, రండి, తరలిరండి
మహాసభకు పోదాం పదండి.

**- పి. జగదీశ్వరీ మూర్తి,**
**సెల్ : 9820577117**


**మీకు తెలుసా..?**

**అమెరికాలో మన భారతీయులు 3.22 మిలియన్లు ఉన్నారు వారిలో...**

**డాక్టర్లలో 38% ✦✦ సైంటిస్టులలో 12%**
**నాసా ఉద్యోగుల్లో 36% ✦✦ మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల్లో 28%**
**ఇంటెల్ ఉద్యోగుల్లో 17% ✦✦ జిరాక్స్ ఉద్యోగుల్లో 13%**

**గ్రీన్‌కార్డు కలిగిన భారతీయ సంతతి 23%**

# గాంధీజీ నిర్ణయం



సౌత్ఆఫ్రికాలో యువ గాంధీ

**ద**క్షిణాఫ్రికాలో న్యాయవాదిగా పనిచేస్తూ సమాజంలో గుర్తింపు పొందినా, అక్కడ తెల్లదొరలు తనను తక్కువగా చూడటం గాంధీ సహించలేకపోయారు.

తెల్లదొరతో మౌనంగా, మొదటి శ్రేణిరైలు పెట్టెలో ప్రయాణం చేస్తుండగా ఆ దొర తన సామాను బయటకు విసిరి వేయటంతో ఉగ్రుడైపోయారు.

ఈ తెల్ల దొరలకు ఎంత ధైర్యం?

ఈ దొరలకెందుకింత పొగరు ?

తమ దేశం కాకపోయినా, ఎందుకిక్కడ ఆధిపత్యం చలాయిస్తున్నారు ?

ఇక్కడి వారు అమాయకులనే కదా ?

"ఈ తెల్లదొరలు ప్రపంచంలోని అమాయక దేశాలను ఆక్రమించుకుని, ఇలా స్వయం ప్రకటిత ప్రభువులవటానికి కారణం ఒక్కరు కూడా తిరగబడకపోవటమేకదా" అనిఅనుకుని ఉండొచ్చు.

ఆ క్షణంలో తన కోపాన్ని అణగదొక్కుకుని "వీడు నా సామాను మాత్రమే బయటకు విసిరేసాడు. నేను ఇండియా వెళ్ళి వీడిని నా దేశం నుండే గెంటివేస్తాను" అనే నిర్ణయం తీసుకున్నారు.

స్వదేశానికి వచ్చి 'అహింస' అనే ఆయుధంతో సమరశంఖం పూరించారు. అంతవరకు స్తబ్ధుగా ఉన్న భారతీయులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

స్వాతంత్ర్యం సాధించాలనే కోరిక ఉన్నా, అది తమ వలనసాధ్యం కాదనే భావనలో భారతీయులుండేవారు. బాంబులు, తుపాకులు, అధికారం, ధనం ఉన్న బ్రిటిషు దొరలను ఏ కోణంలోంచి కూడా ఎదుర్కోలేమనే ప్రగాఢ నైరాశ్యం వారిలోఉండేది.

అంతవరకు కొందరు మహనీయులు ప్రయత్నాలు చేసినా, ప్రజల సహకారం అంతంత మాత్రంగా ఉండేది. అటువంటి తరుణంలో గాంధీజీ అహింసనే మార్గం ఎన్నుకొని, నిరాహార దీక్షలు, పాదయాత్రలు, ఖద్దరు వాడకం వంటి వినూత్న దాడి చేసి ప్రజలందర్నీ ఉత్తేజితుల్ని చేసి, దేశ స్వాతంత్ర్యం గురించి వారిలో ప్రేరణ కలిగించారు.

అందుకే ఆయన మహాత్ముడయ్యాడు. ఈనాటిదాకా ఆ బిరుదు మరెవ్వరికీ లేదు. ప్రజలు ఇవ్వరు కూడా. విషమ పరిస్థితిలో విజ్ఞత ప్రదర్శించాలంటే ఎమోషనల్ ఇంటలిజెన్స్ అవసరం. అది మహాత్మునిలో ప్రతిక్షణం ఉండేది.

సేకరణ : **దాస చంద్రకాంత్**

**మీకు తెలుసా..?**

**భారత దేశంలో మొదటి విశ్వవిద్యాలయం 700 బి.సి.లో 'తక్షశిల'లో స్థాపించబడినది. ప్రపంచ నలుమూలల నుండి 10,500 విద్యార్థులు, 60 సబ్జెక్టులలో విద్యను అభ్యసించారు. 'నలంద' విశ్వవిద్యాలయం క్రీ.పూ. 4వ శతాబ్దంలోస్థాపించబడినది. విద్యారంగంలో ప్రాచీన భారతదేశం సాధించిన ఘనత అపారమైనది.**



Gangadhar G. Pillamarapu
Mobile : 93222 18929
TEL. : 2491 3408
: 2063 0340

**PG**

**INVESTMENT SHOP**

*Professional Insurance & Investment Consultant.*

**MEMBER CHAIRMAN CLUB**

**EXPERT ADVICE ON :**

**Investments ☐ Insurance**
**Tax Saving ☐ Mutual Funds**
**New Passport Formalities**

**JUST GIVE US FEW MINUTES**
**WE WILL SHOW YOU LOT'S OF BENEFITS**

**ll Insurance & Investment Solutions Under One Ro**

योगक्षेमं वहाम्यहम्
LIC

Vehicle Insurance

MediClaim

SMALL SAVINGS
SS
SERVE THE STATE & YOUR FAMILY
Postal Savings

House Insurance

PASSPORT
New Passport


Mutual Funds

Rs
Tax Returns

Advt.

OFFICE : BDD Building No. 94, Shop No. 20, Ground Floor, Near Jamburi Maidan,
Worli, Mumbai - 400 018. • E-mail : pginvestus@yahoo.com

# చిరునామా కోల్పోతున్న సముద్రం (కవిత)



–అద్దేపల్లి రామమోహనరావు

వాడికి కళ్ళు మూతలు పడే టైముకి
డేట్ మారుతుంది
మనకి సూర్యుడు వచ్చి తూర్పు తలుపు తెరిస్తే గాని
రోజు మారదు
అందుకే నిద్రకళ్ళ మీదుగా వచ్చిన స్వాతంత్ర్యానికీ
చూపునిచ్చే సూర్యుడికీ
అంధకారమంత దూరమైపోయింది.

కలల గుడ్డి వెలుగులో కాలు ముందుకు సాగడమే
తప్ప దోవ సరిగా కనిపించడం లేదు
నడిచి నడిచి తప్పుదారి పట్టామని తెలిసిన తర్వాత
కాళ్ళ నెవరికో అప్పజెప్పడం తప్ప
చేసేదేమీ లేదు

స్వాతంత్ర్యం భారతీయుడికొక నినాదం
మూలాన్ని తగల బెడుతున్న సంస్కృతికి మాత్రం
నిజమైన స్వాతంత్ర్యం నిత్య నైవేద్యం
కులం గోడల్ని కూల్చేగొడ్డలి
ప్రజలచేతిలో ఉంది
దాన్ని కుల రాజకీయాల బలంతో లాగేసుకుని
జీవితాల్ని చీల్చే వ్యూహం
పాలకవర్గాల గుప్పిట్లో వుంది
పచ్చని కన్నీటి పత్రాలు రాల్చే చెట్లనీ
నిరుపేద ప్రాణాలు దాచుకున్న సజీవ క్షేత్రాల్ని
అమానుష చట్టాల మారణాయుధాలతో పేల్చేసి
శ్రమను మింగేసే పరిశ్రమలు స్వాతంత్ర్యం పొంది
నేలతల్లి పాలు మట్టి బిడ్డల నోటి నుండి దోచుకుపోతున్నై

తోటంతనీ తన కల కల మధురగీతాలతో
పరవశింపజేసే కొమ్మచాటు కోయిలలా
లోకాన్ని శరీరాంచలాల నుండి
రాగాత్మకం చేసిన మన్మథుడు స్వాతంత్ర్యం పొంది
దిగంబర హింసాగ్నిలో
మరోసారి కాలి బూడిదౌతున్నాడు

ఊహా స్వర్గాల సంచిలో వ్యామోహాల డాలర్లు కుక్కి
అస్వతంత్ర్య జనమంతా
భావిలోకి ఉరుకులు పెడుతున్నారు!
అర్థరాత్రి అంధకారంలో
సముద్రం ఒడ్డున నిలబడ్డాను
దూరంగా
సాగరాంచలాన్ని నొక్కిపెట్టిన రోదసిలో
నౌకలోని దీపం మినుకు మినుకు మంటోంది
నౌక నెమ్మది నెమ్మదిగా జారిపోతోంది...
సూర్యుడికి నమస్కరిస్తూ నిలబడిపోయాను.

## మీకు తెలుసా..?



వైద్యరంగంలో అతిప్రాచీనమైనది 'ఆయుర్వేదం'. 2,500 సం॥క్రితమే వైద్య పితామహుడు 'చరకుడు' ఆయుర్వేదాన్ని ఆవిష్కరించాడు. మళ్ళీ ఈ కాలంలో ఆయుర్వేదం తిరిగి జీవం పోసుకుంటున్నది.

# మంచి మాటల దర్పణం




ఇతరుల మీద పెత్తనం చేయాలనుకునే వారికి తన పై తనకు నియంత్రణ వుండాలి.



ఎవ్వరూ వెంబడించకపోయిన దుష్టుడు పరిగెడతాడు.



రెండిళ్ళ చుట్టం ఆకలితో అలమటించడం ఖాయం.





అదృష్టం కోసం అన్వేషించేవాడు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.



అదృష్టం మోసగించని వారిని దురదృష్టం అణచివెయ్యలేదు.



పొరుగువాడి అవసరాన్ని కనిపెట్టి ఆదుకోవడమే ఔదార్యం

## ఆడపిల్ల

సాహితీ దర్పణం

కవిత

అక్షరాలతో నింపేసే పేజీ కాదు ఆడపిల్ల
అందం...
అయినా సృష్టిలో సమానం ఇరువురి జననం
కానీ మనస్సుకు
భాష్యం చెబుతారు కన్నెలన్నాడో కవి
దాన్ని చూసి వన్నెల వగలాడి
అంటాడో యువకుడు
అసలు భాష్యం తెలియక...

ఆ అందానికి నీవో కవి
ఆ క్షణంలో నీ కన్నుల్లో నేవుండాలి
నీ  గుండెలో నేవుండాలి
నీవే నా జీవితం
అంటూ వెంటాడి
చివరకు మోజు తీరిందా,
ఆ గుండెనేకోస్తావు
అప్పుడు కానరాదు ప్రియురాలి
అందం, చందం
జవరాలుగా కాక ప్రియురాలో అవరోధం
చివరకు ప్రేమ పెళ్ళిగా మారాలంటే
..... ఆంక్షలు, కాంక్షలు,
అయినా అనాధిగా
ఆడదానికి స్వేచ్ఛ
ఓ పింగాణి బొమ్మలా
ఐక్యత కోల్పోవడం నేడు స్త్రీ జాతికి
అవమానం..
తప్పు ఎవరిదైనా
చివరకు ఏడ్వాల్సిందెవరు ?
అందవిహీనమైన ఈ మనస్సును...
అందుకోవడానికి
అందమైన పదతి కావాలా... ఇదే అందం
ఆడపిల్లది....

**- సౌజన్య**
**సెల్ : 09224253384**

## మరాఠీ నేర్చుకుందాం...

" त्यांनी काय खेळले ? "
1) త్యానీ కాయ్ ఖేళ్‌లే ?
2) వారు ఏమి ఆడారు ?

"माझ्याशी बोलू नकोस"
1) మాఝ్యాశీ బోలు నకోస్.
2) నా తో మాట్లాడకు.

"आपल्यांना काय पाहिजे?"
1) అపల్యానా కాయ్ పాహిజే ?
2) మీకేం కావాలి ?

"त्यांना प्रणाम करा"
1) త్యానా ప్రణామ్ కరా.
2) వారికి నమస్కరించు.



## 'పద్య' విహారం

**కృతమెరుగుట పుణ్యము స**
**న్నతి దానికి సమము సేత మధ్యము, మఱిత**
**త్కృతమున కగ్గలముగా స**
**స్కృతి చేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్**



**తాత్పర్యం :-**

ఎదుటివారు చేసిన ఉపకారాన్ని గుర్తించే వారే బుద్ధిమంతులు. అదే పుణ్యకార్యము. మంచి బుద్ధితో దానికి ప్రత్యుపకారం చేయడము మధ్యము. చేసిన ఉపకారం కంటే ఎక్కువ ఉపకారం చేయడం ఉత్తమోత్తమం.




**మీకు తెలుసా..?**
'సంస్కృతం' అన్ని యూరోపియన్ భాషలకూ తల్లివంటిది. 'సాఫ్ట్‌వేర్' రంగానికి సరియైన జోడి 'సంస్కృతం'. (ఫోర్బ్స్ మాగజైన్ 1987)

# సాహితీ కృషీవలుడు....



గత నాలుగు దశాబ్దాలకుపైగా కవిగా, రచయితగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా,కథకుడిగా, సాహితీ సంస్థల నిర్వాహకునిగా, 'ప్రసారిక' మాస పత్రిక గౌరవ సంపాదకునిగా సాహితీ సేవలో తరిస్తున్న డా॥ టి. శ్రీరంగస్వామి గారు సాహితీరంగంలో అందరికీ సుపరిచితులే.

వరంగల్లులో శ్రీలేఖ సాహితీ సంస్థను స్థాపించి, మట్టిలో మాణిక్యం లాంటి రచయితల రచనలను వివిధ సాహితీ ప్రక్రియల రూపాల్లో వెలుగులోకి తెచ్చిన సాహితీవేత్త శ్రీరంగస్వామి! తెలుగు సాహితీ ప్రపంచంలో తనకంటూ.... ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్న ఆయన నిరాడంబరుడు. వృత్తిరీత్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రజారోగ్య శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందిస్తూనే... సాహిత్య సృజనను ప్రవృత్తిగా మార్చుకున్నారు.

16-7-1950న కరీంనగర్ జిల్లా, పర్లపల్లి గ్రామంలో జన్మించిన ఆయన స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి.... సాహితీ లోకంలోఅందరి మన్ననలు పొందారు. విశ్వనాథ వారి కృష్ణవాక్యాలు అంశంతో పి. హెచ్.డి. డాక్టరేట్ పట్టా పొందారు. ఎనిమిది వచన కవితా సంపుటాలను, రెండు పరిశోధనా గ్రంథాలనూ, ఎనిమిది వ్యాస సంకలనాలను వెలువరించారు. సజీవచిత్రాలు అనే కథా సంపుటిని వెలువరించి కథకునిగా సాహితీ లోకానికి దగ్గరయ్యారు. పై గ్రాంథాలే కాకుండా, ఆయన సంపాదకత్వంలో వివిధ ప్రక్రియల్లో 70కి పైగా గ్రంథాలు వెలుగులోకి వచ్చాయి. వీరి గ్రంథాలనేకం ఇతర భాషల్లోకి అనువదింపబడటం విశేషం !

ఓరుగల్లు సాహిత్య వైభవాన్ని తెలిపే, వరంగల్లు రచయితల వాఙ్మయ జీవిత సూచికను ప్రచురించారు. శ్రీలేఖ సాహితీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను వైవిధ్యభరితంగా నిర్వహించారు. వాటిలో 2006లో నిర్వహింపబడిన "శతాధిక కవి సమ్మేళనం" ప్రధానంగా పేర్కొనదగినది.

సాహిత్యమే సర్వస్వమని భావించే శ్రీరంగస్వామి సాహితీ సభల నిర్వహణలో దిట్ట! వర్ధమాన రచయితల సభలనేకం ఏర్పాటుచేసి నవ కవులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహింపబడిన అనేక సమావేశాల్లో ఆయన పాల్గొని తన సాహితీ ప్రతిభను చాటారు.

తన బహుముఖ ప్రజ్ఞా పాటవాలతో, "నవభారత సాహిత్యరత్న" అన్న బిరుదును సాహితీ సమితి వరంగల్లు వారి ద్వారా 2006లో, "దశాబ్ది ఉత్తమ విమర్శకుడు", "సాహిత్యరత్న", "సాహితీ వశిష్ట" లాంటి బిరుదులు వివిధ సాహితీ సంస్థల ద్వారా అందుకున్నారు. విజయభావన విజయనగరం వారి 'సాహితీ పురస్కారం' సోమనాథ కళాపీఠం, పాలకుర్తి వారి "స్వచ్ఛందభాషా సేవా పురస్కారం", కళాజ్యోతి ధర్మవరం వారి సీరిపి ఆంజనేయులు 'సాహిత్య పురస్కారం", జాతీయ సాహిత్య పరిషత్, సిద్ధిపేట వారి యాంసాల బాలయ్య ధార్మిక సాహిత్య పురస్కారాన్ని పొందారు.

వీరి తొలి వ్యాసం 1974 మలేసియా తెలుగు సంఘం వారి ప్రత్యేక సంచికలో ప్రచురింపబడింది. 1970లో యువభారతి వారి "ఉషస్సు" కవితా సంకలనంలో వీరి తొలికవిత అచ్చయింది. 1969లో మాస్కో రేడియో తెలుగు విభాగంలో వీరి తొలికవిత ప్రసారమైంది. 1974లో శశిరేఖ నవల 'కులానికి సమాధి'పై తొలి విశ్లేషణవ్యాసం ప్రచురించబడింది.

ఢిల్లీ, డెహరాడూన్, తిరువణ్ణామలై, మద్రాస్, విజయవాడ, విజయనగరం, హైదరాబాద్, వరంగల్లు, తిరుపతి, రాజమండ్రి, అనంతపురం, మెదక్, కరీంనగర్, తాండూర్ మొదలగు ప్రదేశాల్లో నిర్వహింపబడిన జాతీయ సాహితీ సదస్సుల్లో శ్రీరంగస్వామి గారు పత్ర సమర్పణచేశారు.

1984 నుండి 'ప్రసారిక' సాహిత్య మాస పత్రికకు గౌరవ సంపాదక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వీరి కవితలు, వ్యాసాలు, సమీక్షలు అనేక ప్రముఖ పత్రికల్లో ప్రచురించబడినాయి. 'నీల మోహనాష్టకం' పేరిట వెలువరించిన వచన పద్యాలు వీరికి మంచి పేరుని తెచ్చి పెట్టాయి.

-- దాస్యం సేనాధిపతి.

సెల్ : 09440105987

ట

# హలో.. డాక్టర్ ... హార్టు మిస్సాయే ...!

**మె**ళ్ళో ఉన్నస్టెతస్కోపుని అప్యాయంగా నిమురుతూ, "సూరీడూ"! అని పిలిచాడు వైఎస్.

సూరీడు ఒక్క అంగలో వైఎస్ దగ్గరకి దూకి వినయంగా చేతులు కట్టుకుని నించున్నాడు. "సూరీడు! మొన్న వైజాగ్‌లో మెగా వైద్య శిబిరానికి వెళ్లొచ్చాను చూడూ.." అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న వైఎస్‌కి అడ్డు తగిలాడు సూరీడు.

"సార్! తమరు మరోలా అనుకోకపోతే చిన్న మనవి... మెగా వైద్య శిబిరం అంటే మెగాస్టార్ చిరంజీవి పెట్టిన వైద్య శిబిరం అనుకుంటున్నారు సార్! పేరు మారిస్తే బావుంటుందేమో?"

" అయితే ఏంటటా! మెగాస్టార్ పుట్టక ముందే మెగా అన్నమాట పుట్టింది.. ఇంకా నయం... మెగావాట్లు పేరు కూడా మార్చమనలేదు.... ఆ సంగతి వదిలెయ్... నే చెప్పేది విను..." అన్నాడు వైఎస్.

సూరీడు కళ్ళలో ఆనంద బాష్పాలు సుడులు తిరిగాయి. చప్పట్లుకొట్టి అన్నాడు. "ఆహా... ఓహో.... ఒక నిజమైన డాక్టర్ని ఇప్పుడు మీలో చూస్తున్నాసార్... నా జన్మధన్యమైంది.... తమరు తలుచుకోవాలే గానీ అదెంత భాగ్యం.... మన క్యాంప్ ఆఫీసులోనే ఓ వైద్య శిబిరం ఏర్పాటు చేయించమంటారా ?

"అలా చేస్తే కొన్ని వేల మంది జనం వచ్చేస్తారు... అభివృద్ధి కార్యక్రమాల అమలులోఊపిరి సలపకుండా ఉన్న నాకు అంత టైమెక్కడిది? వద్దులే సూరీడూ"నిట్టూర్చాడు వైఎస్.

సూరీడు నుదురు మీద టపీటపీమని కొట్టుకున్నాడు. "హయ్యో!మీ కోరిక తీరేదెలా? మీకు తృప్తి కలిగేదెలా? భగవంతుడా... మార్గం చూపించు" అంటూ ఆక్రోశించాడు. వైఎస్ అప్యాయంగా సూరీడు భుజంతట్టాడు. వెంటనే సూరీడు బుర్రలో ఫ్లాష్‌లా ఓ ఆలోచన మెదిలింది. ఎగిరి గంతేసి అన్నాడు. "సార్.... బ్రహ్మాండమైన ఐడియా... మనం మన అఖిలపక్ష నాయకుల కోసం ప్రత్యేకంగా ఓ వైద్య శిబిరాన్ని



ఏర్పాటు చేద్దాం... లిమిటెడ్‌గా ఉంటారు కాబట్టి మీక్కూడా టైము సరిపోతుంది..

"వెరిగూడ్ అయిడియా... కానీ వాళ్ళువస్తారంటావా ?" అనుమానంగా అన్నాడు వైఎస్.

"ఎందుకు రారు సార్! మీరు స్వయంగా అందరికి లేటర్స్ రాసి పంపండి... తప్పకుండా వస్తారు... పైగా అన్ని టెస్టులూ ఫ్రీ కదా!" ధీమాగా అన్నాడు సూరీడు. "ప్రతి పక్షాలతోపాటు మన కాంగ్రెస్ వాళ్లని కూడా పిలుద్దాం... నువ్వు ఆ శిబిరం ఏర్పాటు చూడు" పురమాయించాడు వైఎస్.

"చిత్తం.. చెప్పండి.."

వైఎస్ రిలాక్సింగ్‌గా కుర్చీలో వెనక్కి వాలి స్టెతస్కోపు బిళ్ళకేసి దీర్ఘంగా చూస్తూ అన్నాడు. "మొన్న వైజాగ్ ఆరోగ్య శిబిరంలో కొందరు పేషెంట్లని నేనే స్వయంగా టెస్టు చేశా సూరీడూ! వర్షం రావడం, టైములేకపోవడం వల్ల ఎక్కువ మందిని చూడలేకపోయాను.

ఒక డాక్టరుగా నాకు తృప్తి తీరలేదు సూరీడూ! ఏదో వెలితిగా వుంది... ఇంకా చాలామందికి టెస్టు చేసిఉంటే బాగుండేదనిపిస్తోంది..."

ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో రాజకీయ నాయకుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటైంది. వైఎస్ తన పూర్వాశ్రమంలో మాదిరిగా డాక్టర్ అవతారమెత్తాడు. మెళ్ళో స్టెతస్కోపు పెట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. రాజకీయ నాయకులు ఒక్కొక్కరే రావడం మొదలుపెట్టారు.

టిడిపి నేతలు చంద్రబాబు నాయుడు,కోడెల శివప్రసాద్‌రావు, నాగం జనార్ధన్‌రెడ్డి.... సీపీఎం నేత రాఘవులు, సీపీఐ నేత నారాయణ... టిఆర్ఎస్ అధినేత కెసీఆర్.. బీజేపీ నేత బండారు దత్తాత్రేయ... కాంగ్రెస్ నేత ఎమ్మెస్కార్... అందరూ వచ్చి కూర్చున్నారు.

వైఎస్ గొంతు సర్దుకొని గంభీరంగాఅన్నాడు. అందరూ ఒక్క ఉదుట్నలేచి గోలగోలగా చెప్పడం మొదలుపెట్టారు.

"సార్... ఎరువులుదొరక్క రైతులు అల్లాడిపోతున్నారు... కరెంటుకోతతో ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు.. సెజ్‌ల వల్ల భూములు కోల్పోయి పేద ప్రజలు రోడ్డు మీద పడుతున్నారు...'' ఎక్కడ చూసిన అవనీతి రాజ్యమేలుతోంది..."

వైఎస్‌కి మందహాసం నించి వికటాట్టదాకా అన్ని రకాల నవ్వులూ కట్టకట్టుకొని తన్నుకొచ్చాయి. భూనభోంతరాళాలు దద్దరిల్లేలా నవ్వాడు.

"మేమెప్పుడు ప్రజా సమస్యల గురించి చెప్పినా మీకిలాగే నవ్వొస్తూ ఉంటుంది..." నిష్టూరంగా అన్నారు ప్రతిపక్ష నేతలు... వైఎస్ నవ్వాపి అన్నాడు.

"నేనడిగింది ఆ కంప్లయింట్ గురించి కాదమ్మా! మీ ఒంట్లో రుగ్మతలేమిటీ అని ఓ డాక్టరుగా పలకరించా... సరే... ఒక్కొక్కరూ వచ్చి చెప్పండి.... మనలోఅందరి కంటే వయసులో ఎమ్మెస్ గారు పెద్దవారు.. ముందు ఆయనతో మొదలుపెడతా..."

"సార్ ఎమ్మెస్‌గారు ... ఇలా రండి".

ఎమ్మెస్ వచ్చి వైఎస్ ఎదురుగా కూర్చున్నాడు. వైఎస్ ఆయన ఛాతీ మీద స్టెత్‌పెట్టి జాగ్రత్తగా విన్నాడు.

''ఇదేంటి.. మీ గుండె 'గవర్నర్... గవర్నర్' అనికొట్టుకొంటోంది..."ఆశ్చర్యంగా అన్నాడు.

"ఇందులో వింతేముంది... ఎప్పట్నించో నా గుండెల్లో గూడు కట్టుకున్న కోరిక అది... నయం చేస్తావా రాజశేఖర్!"దీనంగా అడిగాడు ఎమ్మెస్.

"ఇది ఢిల్లీకి రిఫర్ చేయాల్సినకేసు.. నా చేతుల్లో ఏమిలేదు..."నిర్మొహమాటంగా చెప్పేసి, నెక్స్ట్... అన్నాడు వైఎస్.

బండారు దత్తాత్రేయ అరచెయ్యి గోక్కుంటూ వచ్చి కూర్చున్నాడు.

"వైఎస్ గారు... నా కుడి అరిచెయ్యి ఒకటే దురద... ఏదన్నా మందిచ్చి పుణ్యంకట్టుకోండి... ఆ శ్రీరాముడు మిమ్మల్ని చల్లగాచూస్తాడు..."

వైఎస్ ఆయన చేతిని పరీక్షించి అడిగాడు. "ఇప్పటిదాకా మీరు నాకెన్ని ఉత్తరాలు రాశారు"?


"నూట ఏడు"... "తొందరగా వెయ్యి ఉత్తరాలు పూర్తి చేయండి... చేతి దురద ఆటోమెటిక్‌గా తగ్గిపోతుంది." .. నెక్ట్స్ పిలిచాడు వైఎస్.

కే సీఆర్ వచ్చి కూర్చున్నాడు. వైఎస్ స్టెత్‌ని ఆయన ఛాతీమీద పెట్టాడు. "తెలంగాణ... తెలంగాణ.. అని కొట్టుకుంటోంది కదూ!" చిరునవ్వుతో అన్నాడు కేసీఆర్.

వైఎస్ తలూపి చెప్పాడు "ఎస్.. ఇది క్రానిక్ ప్రాబ్లం... లోకల్ డాక్టర్‌తో నయం కాదు.... మీ కేసు కూడా ఢిల్లీకి రిఫర్ చేస్తా!... నెక్ట్స్"

రాఘవులు వచ్చికూర్చోగానే వైఎస్ స్టెత్‌పెట్టి చూశాడు."ట్రింగ్ ట్రింగ్... ట్రింగ్ ట్రింగ్..."అంటూ సైకిల్ బెల్లు మోత వినిపించింది. రాఘవులు భుజం తట్టి చెప్పాడు వైఎస్. "రాఘవులు గారు!వయసుమీద పడుతోంది.. మీరిక సైకిల్ తొక్కడం మానేసి, కనీసం స్కూటర్ మీదైనా తిరగండి.. రాజకీయంగా కూడామీరు సైకిల్ ఎక్కొద్దని నా సలహా... నెక్ట్స్...

నారాయణ వచ్చాడు. వైఎస్ ఆయన గుండె మీద స్టెత్ పెట్టి జాగ్రత్తగా విన్నాడు. కనుబొమ్మలు ముడిచాడు. వెంటనే పెన్ను తీసి గబగబా ప్రిస్క్రిప్షన్ రాసి నారాయణకిచ్చాడు.



"ఇవి మెడికల్ షాపులో దొరకవు"... ఏదైనా రెస్టారెంట్లో ట్రయ్ చెయ్యండి.... అన్నాడు..

నారాయణ చీటీని చదివాడు.

''చికెన్ బిర్యానీ.... చికెన్ కర్రీ... చికెన్ మంచూరియా...చికెన్ సిక్స్టీఫైవ్... ఏమిటిది వైఎస్ గారూ... మళ్ళీ గాంధీ జయంతి దాకా నేను చికెన్ ముట్టుకోనని శపథం చేసిన సంగతి మీకు తెలుసు కదా! ఇప్పుడెలా ? అంటూ బిక్క మోహంపెట్టాడు నారాయణ.

"మరేం చెయ్యను... మీ గుండె 'కొక్కరొకో.... కొక్కరొకో అని తెగ కొట్టుకుంటోంది. దానికిదే మందు మరి... పోనీ, ఓ పని చేయండి... ప్రస్తుతానికి కోడికి బదులు పకోడితో సరిపెట్టుకొండి..." సలహా ఇచ్చారు వైఎస్.

ఫైనల్గా చంద్రబాబు వచ్చి కూర్చున్నాడు. వైఎస్ ఆయన గుండెమీద స్టెత్ పెట్టి వినిచెప్పాడు.

"చంద్రబాబూ... నీ గుండె "కుర్చీ...కుర్చీ" అని కొట్టుకుంటోంది....... మన స్టేట్లో నీకది దొరకదు గానీ ఢిల్లీలో ట్రయ్ చేసుకో..... ఇంకా ఏమిటి కంప్లయింట్?"

"కడుపులోఒకటే మంట..."అన్నాడు చంద్రబాబు.

"మీకోసం' పేరుతో ఊరూరూ తిరిగి , మా అభివృద్ధి కార్యక్రమాల్ని చూశావు కదా! కడుపు మంటగానే ఉంటుంది... అంచేత ఆ యాత్ర ఆపెయ్యమని నా సలహా ... నెక్స్ట్... కోడెల గారూ ! మీరోస్తారా!" అన్నాడు వైఎస్.

"వస్తాగాని.. నేనుటెస్ట్ చేయించుకోను... నేనుకూడా డాక్టర్నే... నేనే మీకు టెస్టు చేస్తా..." అన్నాడు కోడెల.

" ఓకె వెల్కమ్.... నాకేం అభ్యంతరం లేదు..." అంటూ వైఎస్ కూర్చున్నాడు. కోడెల ఆయన గుండెమీద స్టెత్పెట్టి విని, విజయ గర్వంతో అన్నాడు.

"నేననుకున్నట్టే అయింది.. మీ గుండె లబ్...డబ్... మని కొట్టుకోవడం లేదు... డబ్బా.. డబ్బా... అని కొట్టుకుంటోంది.. మీకెప్పుడూ డబ్బు మాయే... ఈ రోగానికి మందు మీకు తెలుసుకాబట్టి రాష్ట్రాన్ని దోచుకు తింటున్నారు.."

కోడెల వైపు మండిపడుతూ చూశాడు వైఎస్.

"నాకంత ఖర్మ పట్టలేదయ్యా! నేను పుట్టడమే నోట్లో బంగారం స్పూన్తో పుట్టాను.... దీని మీద నేను సెకండ్ ఒపీనియన్ తీసుకుంటాను... నాగం జనార్ధన్ ....నువ్వు కూడా డాక్టర్వేగా.. నువ్వు చూడు..." అన్నాడు వైఎస్.

నాగం జనార్ధన్రెడ్డి స్టెతస్కోప్ మెళ్ళో వేసుకుని వైఎస్ ఛాతీమీద పెట్టి చూశాడు. అతడి కళ్ళు పెద్దవయ్యాయి. వెంటనే వీపు మీద పెట్టి చూశాడు.. గుండె.. వీపు... రక రకాల ప్లేసులు మార్చి మార్చి మరీ చూశాడు. కెవ్వున కేక పెట్టాడు. కోడెల వైపు తిరిగి చూస్తూ అన్నాడు.

"వైఎస్ గారు చెప్పింది కరెక్టు.. ఆయన సెకండ్ ఒపీనియన్ తీసుకోవడమే మంచిదయ్యింది... నీ డయగ్నసిస్ తప్పు శివప్రసాద్ గారు! వైఎస్ గుండె 'డబ్బా.... డబ్బా..... అని కొట్టుకోవడంలేదు...

వైఎస్ ముఖం వికసించింది. విజయ గర్వంతో అందర్నీ చూశాడు, మెచ్చుకోలుగా నాగం భుజం తట్టాడు.

"....నిజం చెప్పాలంటే నాకేం వినబడ్డంలేదు... అంటే వైఎస్ది రాతి గుండేమో... కళ్ళ ముందు జనం ఇన్ని అగచాట్లు పడుతున్నా ఇందుకేనేమో స్పందించడం లేదు....." కసి తీరా అన్నాడు నాగం.

ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...

## అభినందనలు





**మ**హాసభ జీవిత సభ్యులు బండి నారాయణ రెడ్డి గారి సుపుత్రులు చిరంజీవి **బండి శిరీష్కుమార్ రెడ్డి,** గౌతమ్ జూనియర్ కాలేజి, విజయవాడ నుండి ఇంటర్మీడియట్లో 917 మార్కులు సాధించి 'ఎ గ్రేడ్' లో మరియు ఐ.ఐ.టి ఖరగ్పూర్ నుండి 'జి.ఇ.' కేటగిరిలో మెరిట్లిస్ట్ లో 540 వ ర్యాంక్ సాధించినందుకు ఆంధ్ర మహాసభ అభినందనలు అందిస్తోంది.


✦ ✦

**మ**హాసభ ఉపాధ్యక్షుడు (లిటరరీ & జింఖానా) డా॥ విజయ సారధి గారి సుపుత్రిక **పి. శ్రీదివ్య** ఎస్.ఎన్.డి.టి. యునివర్సిటీ నుండి బి.టెక్. చివరి సం॥లో 84% మార్కులు సాధించి ఉత్తీర్ణురాలైనందుకు మహాసభ అభినందనలు తెలియజేస్తోంది.

✦ ✦

**మ**హాసభ జీవిత సభ్యులు ముక్కు నారాయణ రెడ్డి కుమారుడు. **ముక్కు జనార్దన్ రెడ్డి** ఎమ్. ఎచ్. టి – సి.ఇ.టి.2008 పరీక్షల్లో మెరిట్లో 202 స్థానం సంపాదించి ఎం.బి.బి.ఎస్ లో చోటు దక్కించుకున్నందుకు ఆంధ్ర మహాసభ అభినందనలు తెలుపుతోంది.

# పూజకు వేళాయెరా ..!



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం, ప్రతి రోజు సుప్రభాతమనే 'మేలుకొలుపు' సేవతో ప్రారంభమై బంగారు వాకిళ్ళు తెరవబడతాయి. తిరుమలలో ఈ నాటికీ ప్రతిరోజూ మొట్టమొదటగా శ్రీస్వామి వారి దర్శన భాగ్యాన్ని పొందుతున్న వ్యక్తి సన్నిధి గొల్ల.

మొదట్లో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిచే మొదటి దర్శనభాగ్యాన్ని వరంగా పొందిన ఆనాటి గోపాలకుని (యాదవుని) సంతతికి చెందిన వ్యక్తే ఈ గొల్ల. శ్రీ స్వామి వారి సన్నిధి సేవతో సంబంధించిన వ్యక్తి కాబట్టి ఇతడ్ని "సన్నిధి గొల్ల" అని పిలుస్తారు.

ప్రతిరోజూ బ్రాహ్మీ ముహూర్తంలో సన్నిధి గొల్ల దీవిటీని పట్టుకొని, తిరుమల ఉత్తరమాడ వీధిలో వున్న వైఖానసులైన అర్చకుల "తిరుమాళిగ' (ఇంటికి) కు వెళ్లి వారిని ఆలయానికి రమ్మని పిలుస్తాడు.

అర్చకులు 'కుంచెకోల' (ఇనుపకొక్కెం)ని భుజంపై పెట్టుకుని తాళం చెవుల గుత్తిని తీసుకొని, ఆ సన్నిధి గొల్ల వెంట వెళతారు. అర్చకులు దారిలో శ్రీ భూవరాహ స్వామి వారి ఆలయానికి ఆత్మ ప్రదిక్షిణం చేసి నమస్కరించి గొల్లవెంట శ్రీవారి ఆలయపు మహాద్వారం (పడికావలి) వద్దకు వెళతారు.

అప్పుడు ఆలయ గోపురానికి ఎదురుగా మెట్లకు దక్షిణం వైపున మేడమీద వున్న నగారా మండపం (నౌబత్ ఖానా)లో శ్రీవారి అర్చకుల రాకను తెలియజేయడానికన్నట్లుగా పెద్ద పలక గంటను మోగిస్తారు.

అప్పుడు మహాద్వారం తెరవబడుతుంది. గొల్ల ముందుకు పోతుండగా, అర్చకులు ప్రధాన ద్వారదేవతలకు నమస్కరించి, ఆలయంలోకి ప్రవేశిస్తారు.

ఆ తర్వాత కుంచెకోలను, తాళంచెవులను ధ్వజస్తంభం దగ్గరున్న క్షేత్రపాలకుడి శిలకు తాకించి, వెండివాకిలి (నడిమిపడి కావలి)లోకి వెళతారు.

సన్నిధిగొల్ల శ్రీ స్వామివారి సన్నిధివీధిలో బేడి ఆంజనేయస్వామి వారి ఆలయం దగ్గరున్న శ్రీమాన్ పెద్దజియ్యంగారి మఠానికి వెళ్ళి, జియ్యంగారు గాని లేదా వారి పరిచారకుడైన ఏకాంగి గానీ వెంటరాగా ఆలయానికి వస్తాడు. ఆలయ అధికారి అయిన పేష్కారు కూడా ఆ సమయానికి ఆలయానికి వస్తాడు.

అప్పుడే సుప్రభాతం చదివే ముగ్గురు లేదా నలుగురు అధ్యాపకులు బంగారు వాకిలి దగ్గర నిలబడతారు. అలాగే తాళ్ళపాక అన్నమయ్య వంశానికి చెందిన ఒకతను తంబుర పట్టుకొని 'మేలుకొలుపు' సంకీర్తన పాడటానికి బంగారు వాకిలి దగ్గర సిద్ధంగా వుంటాడు.

ఇలా వీళ్ళంతా బంగారు వాకిలి ముందున్న సమయంలో, ముందుగా అర్చకులు తమ దగ్గరున్న 'కుంచెకోల'తో బంగారు వాకిలికి వున్న చిన్నరంధ్రం ద్వారా లోపల వేసిన గడియను బయటినుండే తీస్తారు.

తర్వాత వాకిలి మధ్యలోని గడియకు వేసిన తాళాన్ని అర్చకులు తమ దగ్గరున్న తాళంచెవితో తీస్తారు.

సన్నిధిగొల్ల పేష్కారు దగ్గరున్న సీలు వేసిన చిన్న సంచి (తిత్తిని) అందరికీ చూపించి, దాన్ని విప్పి, అందులో వున్న తాళం చెవులతో, బంగారు వాకిలికి సీలు వేసిన మూడు పెద్ద తాళాలను, సీళ్లను అందరికీ చూపించి తీస్తాడు.

అర్చకులు, జియ్యంగారు,  ఆలయ అధికారులు ఈ ముగ్గురి సమక్షంలో గొల్ల బంగారు వాకిళ్ళకు వున్న తాళాలను తీస్తాడు. ఈ ముగ్గిరిలో ఏ ఒక్కరు లేకపోయినా బంగారు వాకిలి తాళాలు తీయడంగానీ, వేయడంగానీ జరగదు.  ఇలా బంగారు వాకిలి గడియలకు వేసివున్న తాళాలను తీసిన వెంటనే సన్నిధిగొల్ల బంగారు వాకిలిని తెరిచి దివిటీతో ముందుగా లోపలికి వెళతాడు.

వెంటనే శ్రీవారి అర్చకులు "కౌసల్య సుప్రజారామా'... అంటూ సుప్రభాతాన్ని చదువుతూ, బంగారు వాకిలి లోపలికి వెళతారు.

ఏకాంగి, మహంతు మఠంవారు తెచ్చిన పాలు, చక్కెర, వెన్న, తాంబూలం ఈ వస్తువులున్న పళ్లాన్ని తీసుకొని, లోపలికి వెళ్ళిన వెంటనే బంగారు వాకిళ్లను మళ్ళీదగ్గరకు వేస్తారు.  బంగారు వాకిలి ముందున్న అధ్యాపకులు, అర్చకులు చదువుతున్న సుప్రభాతాన్ని వెంటనే అందుకుంటూ చదువుతారు.

అటు అర్చకులు, అధ్యాపకులు సుప్రభాతాన్ని చదువుతుండగా, అప్పుడే బంగారు వాకిలి దగ్గరున్న తాళ్ళపాక వంశీయుడొకడు తంబుర మీటుతూ స్వామి వారికి మేలుకొలుపు పాడతాడు.

తర్వాత ఉదయం వరుసగా శ్రీవారికి తోమలసేవ, కొలువు, సహస్రనామార్చన, మొదటి గంట (నైవేద్యం), మళ్ళీ మధ్యాహ్నం అష్టోత్తర శతనామార్చన, రెండవ గంట (నైవేద్యం), కళ్యాణోత్సవం, వసంతోత్సవం, బ్రహ్మోత్సవం, డోలోత్సవం, సహస్రదీపాలంకార సేవలు జరుగుతాయి.  మళ్ళీ రాత్రి సేవలుగా తోమాలసేవ, అష్టోత్తర శతనామార్చన, రాత్రిగంట (నైవేద్యం) కార్యక్రమాలు నిర్వహించబడుతాయి.

చివరగా రాత్రి శ్రీవేంకటేశ్వర స్వామివారికి పవళింపుసేవ (ఏకాంతసేవ)తో నిత్యపూజా కార్యక్రమం పూర్తి అయి, ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ద్వారాన్ని మూసివేస్తారు.

**- సంగెవేని రవీంద్ర**
**9987145310**
(పత్రికల్లో నుండి సేకరించి...)


Contact : 9322676343
Resi. : 64169134




# Shree Ganesh Enterprises

***Real Estate Consultant***

Dealing in : Sale, Purchase, Rental & Personal Loan

**ఆఫీస్‌లు, ఫ్లాట్స్, బంగళాలు అద్దెకు గానీ, కొనుగోలుకు గానీ, అమ్మకానికి గానీ, ఇటు వాషి నుండి పన్వేల్ వరకు, అటు డోంబివలి వరకు మమ్మల్ని సంప్రదించండి..!**



Kishan G. Vasala

Advt.

Shop : PMGP Colony Bldg. No.10, Shop No.6,  Mankhurd (W), Mumbai -43.

Resi. : Plot 12/0/5, Baiganwadi, Govandi, Mumbai - 43.

# ‘కవర్’ కన్నీటి కథ

- సురేశ్

**ఓ** మోస్తారు ఊరు. అది దాని శివారు. చుట్టూ చెత్తకుప్పలు. చిత్తు కాగితాలు. ముఖ్యంగా వాడి పారేసిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు.....

భుజాన పెద్ద ప్లాస్టిక్ సంచివేసుకుని కొందరు చకచకా కవర్లను ఏరేస్తున్నారు. దొరికినవి దొరికనట్లు సంచిలో వేసేస్తున్నారు.

అన్ని కుప్పల్లో.... ఓ చెత్తకుప్ప. దానికో ప్రత్యేకత.. ఓ ‘వెటరన్’ ప్లాస్టిక్ కవరుకు అది ఆవాసం. అది ఇప్పటిదాకా ఎవరి కంటా పడలేదు. పడితే... అక్కడ ఉండేది కాదు. దానికి అనుక్షణం బతుకు భయం. ఎవడెత్తుకెళతాడో అని. ఎత్తికెళ్ళిన వాడు ఏం చేస్తాడు.... ప్లాస్టిక్ కర్మాగారానికి తరిస్తాడు. ఆ పై ఏం జరుగుతుంది.... పెనంలాంటి పెద్ద భాండంలో వేసి... కింద మంట పెట్టి.... కరిగించి... మరిగించి...... కొత్త రూపం ఇస్తాడు. ఆ తళతళలు ఎన్నాళ్లు? అచ్చంగా మూన్నాల్లు. ఎవరో ఒకరు మళ్ళీ తనను వాడి



పారేస్తారు. భూలోకంలోనే నరకం చూపిస్తున్నారు. ఈ నరకం నుంచి నన్ను, నా వాళ్లను తప్పించాలంటే.... ఏం చేయాలి ? ఏదో ఒకటి చేయాలి. ఆలోచించగా.... చించగా ఆలోచనా స్రవంతిలో మునిగిపోయింది ప్లాస్టిక్ కవరు.

బుర్రలో తళుక్కున ఓ ఉపాయం వెలిగింది. ఎస్స్స్...... తపస్ చేయాలి. ఎవరి గురించి చేయాలి ? బ్రహ్మ.... ఆయన సులువుగా ప్రత్యక్షమవుతాడట. ఆయననే వేడుకుంటా. ఈ నరకం నుంచి ‘మోక్షం’ ప్రసాదించాల్సిందిగా కోరుకుంటా. అనుకున్నదే తడవుగా...చెత్తకుప్పలో నుంచి చెంగున బయటకు దూకింది కవరు. బాగా దూరంగా.. మారుమూలగా.. ఉన్న ఒక పెద్ద చెత్తకుప్పలోకి దూరింది. ఎవరికీ కనపడకుండా లోలోపలికి పోయింది. చెమట పోస్తున్న.. కుళ్ళు కంపు కొడుతున్నా...... లెక్కచేయకుండా మొదలుపెట్టింది... తపస్సు.

సత్యలోకం...చల్లటి వాతావరణం. బ్రహ్మదేవుడి పక్కన చదువుల తల్లి సరస్వతి. ఈమె వేలికొసలు వీణపై చకచకా కదులుతున్నాయి. చక్కటి సంగీతాన్ని ఆస్వాదిస్తూ... తన్మయత్వంతో మునిగిపోయాడు బ్రహ్మ.

ఉన్నట్టుండి వాతావరణం వేడెక్కింది. ఇబ్బందిగా అనిపించి బ్రహ్మ అటూ ఇటూ కదిలాడు. సరస్వతి కూడా వీణానాదం ఆపి బ్రహ్మకేసి ఏమిటది ? అన్నట్టు చూసింది.

ఇద్దరి చెవులకూ లీలగా వినిపించింది....

ఓం బ్రహమ్మదేవాయ నమః ....................

ఓం బ్రహమ్మదేవాయ నమః ....................

మంద్రంగా వినిపిస్తోంది. షార్టుకట్‌లో వరాలు కోరే ఈ కలికాలంలో తపస్సులా!

బ్రహ్మదేవుడి ముఖంలో ఆశ్చర్యం. తన గురించి తపస్సు చేసే వాళ్ళున్నారన్న ఆనందం. ఈ నాదం ఎక్కడిది ? అంటూ కిందికి చూశాడు.

విశ్వం..... భూగోళం.... భారతదేశం.... ఆంధ్ర ప్రాంతంలో ఆ ఊహు.... ఊరి శివారు.... మూలనే పెద్ద చెత్తకుప్ప. అక్కడ నిలిచింది బ్రహ్మదృష్టి ఎవరో ... అక్కడ కూర్చుని తపస్సు చేస్తున్నారు.

పూర్వం ఘోరారణ్యాల్లో ప్రశాంతంగా ఏ చెట్టు కిందో తపం ఆచరించేవాళ్ళు. ఇప్పుడు ఊరి శివార్లలోనే కూర్చుని చేస్తున్నారన్నమాట. అప్పుడు చుట్టూ పుట్ట పెరిగేది. ఇప్పుడు చెత్తకుప్ప పెరుగుతోందన్న మాట. బ్రహ్మ మెదడులో ఆలోచనల సుడులు. ఏమైతేనేం... చాన్నాళ్ళ తర్వాత వరాలిచ్చే అవకాశందొరికింది. రక్కున ప్రత్యక్షమై... కోరింది ఇచ్చేస్తే పోలా !

భూలోకానికి వచ్చాడు భరించలేని వాసన. కాని విధిలేని పరిస్థితి. నేలకు మూడడుగుల ఎత్తునే... ముక్కు మూసుకుని చెత్తకుప్ప ముందు నిలిచాడు స్వామి. బ్రహ్మదేవుడు వచ్చాడని సింబాలిక్‌గా తెలిపేందుకు... హోరునా గాలివీచింది. చెత్తంతా అటూ ఇటూ ఎగిరిపోయింది. ఒకే ఒక్క కవరు అక్కడ మిగిలింది.



మళ్ళీ ప్రశాంత వాతావరణం. మానవ మాత్రులెవరూ లేరే ! తపస్సు చేసిందెవరంటూ.. బ్రహ్మ తీక్షణంగా చూశాడు. సందేహం లేదు. ఆ భక్తుడు మరెవరో కాదు. ఈ కవరే ! అని నిర్ధారించుకున్నాడు. కవరును ఏమని పిలువాలి? ఇంతకీ కవరు భక్తుడా, భక్తురాలా? అనే మీమాంసలో పడ్డాడు. చివరకి "భక్తి శిఖామణీ" అంటూ పిలిచాడు. కవరు కనులు తెరిచింది. ఇన్నాల్లా తర్వాత ఒక్కసారిగా వెలుగు చూసే సరికి కళ్ళు జిగేల్మన్నాయి. కనురెప్పలు టపటపలాడిస్తూ... మెల్లగా చూసింది ఇంకేముంది.... ఎదురుగా బ్రహ్మ. సాష్టాంగా నమస్కార్ చేసింది కవరు.

నమో బ్రహ్మదేవా!

నమో సృష్టికర్తా!

నమో ప్రాణదాత!

నమో మోక్ష ప్రదాతా!

నమస్తే.... నమహః!

కవరు భక్తితో ప్రణమిల్లింది.

స్తుతితో సృష్టికర్త సంతసించాడు. సంతుష్టుడయ్యాడు.

"భక్తా! నీకోసం నేనేమి చేయగలను. ఏ వరం కావాలో కోరుకో!' బ్రహ్మ వరాలు ప్రకటించేందుకు సిద్ధమయ్యాడు.

కవరు చేతులు జోడించి నోరు తెరిచింది. "నాకూ నా జాతికి మళ్ళీ పుట్టుక లేకుండా చావును ప్రసాదించు స్వామి! సవినయంగా కోరింది కవరు.

కవరు చావు అని అమాయకంగా అన్నా... అది 'మోక్షం' అని బ్రహ్మ తేలిగ్గానే అర్థం చేసుకున్నాడు. మోక్షమే కదా..ఎంతమందికి ఇవ్వలేదు. ఇచ్చేద్దాం. " సరే .... నీకు మోక్షం ప్రసాదిస్తా! తీసుకో! తథాస్తు!" అన్నాడు బ్రహ్మ.

కవరు కళ్లలో ఆనందం తాండవిస్తుందని బ్రహ్మ అనుకున్నాడు. కానీ... మొదటిసారిగా ఆయన అనుకున్నది జరగలేదు. ముఖకవళికల్లో ఏ మాత్రం తేడా చూపకుండా కవరు మళ్ళీ నోరు తెరిచింది.

"స్వామీ! నాకు మోక్షం లభించడం అంత సులువుకాదు. ఇదిగో... నాకిది 16వ జన్మ. ఇంతకు ముందు 15 సార్లు మరణించాను. మళ్ళీ జన్మించాను. మళ్ళీ మరణిస్తాను. మళ్ళీ జన్మిస్తాను. ఇందులో.... ఎలాంటి తేడా ఉండదు. కాలచక్రంలాగే.... ఇదీ ఆగదు!" అంది కవరు.

బ్రహ్మ ముఖంలో కొత్త విషయాలు తెలుస్తున్నాయనే ఆసక్తి.

"దేవరా! మీరు సృష్టించిన మనిషి నన్ను పుట్టించాడు. అతనే చంపేస్తాడు. మళ్ళీ పుట్టిస్తాడు. మరణానికి మరో జన్మకు మధ్య నన్ను మరిగిస్తాడు. యంత్రభూతాల మధ్య నలిపేస్తాడు. కొత్తదైనా ఒక్కసారే వాడేసి... నలిపి పారేస్తాడు. నాకు శాశ్వతమైన మరణం లేదు ప్రభూ.. లేదు..

భూమిలో పాతేస్తే... వందలు, వేలు సంవత్సరాలు అలాగే ఉండిపోతాను. వానలో తడవను అగ్ని కూడా నన్ను పూర్తిగా దహించలేదు. జన్మ.... మరుజన్మ. ఇదే నా కర్మ. ఓసారి చుట్టూ చూడండి. ఎక్కడ చూసినా మేమే. ఇప్పుడు పట్టణాల్లోనే కనిపిస్తున్నాం. రేపు పల్లెల్లో, ఎల్లుండి పొలాల్లో ఆ మరుసటి రోజు ఆహారంలో, భవిష్యత్తులో ఎక్కడ చూసినా మేమే ఉంటాం.

మావల్ల పర్యావరణం దెబ్బతింటోంది. మాలోవృథా ఆహారంపెట్టి.. చుట్టి పడేస్తున్నారు. ఆకలితో గోమాతలు ఆహారమనుకుని మమ్మల్ని తింటున్నాయి. మరణిస్తున్నాయి. గోహత్యాపాతకం మమ్మల్ని చుట్టుకుంటోంది.

మురుగు కాల్వలు, జలాశయాలు, ఊరిశివార్లు... అన్నింటా ఉపరితలాలపైనా మేమే. చెట్లు కొట్టేస్తూ... కవర్ల వాడకం పెంచడంతో... భూమి వేడెక్కుతోంది. ఇప్పుడే వానలు కురవడంలేదు. రేపు మరింత భయానకంగా ఉండక తప్పదు. మీరు సృష్టించిన మనిషి.... కూర్చున్న కొమ్మనే నరికేసుకుంటున్నాడు.

'ఇందుగలడందు లేడను సందేహం వలదు సుమీ... ఎందెందు వెతికిన అందందే కలదు.... చక్రి కవరోపగతుండు' అని ప్రహ్లాదుడు శ్రీహరిని గొప్పగా పొగిడాడు. కలికాలంలో ఇది మాకు వర్తిస్తుంది ప్రభూ.

అయినా... ఇది కలియుగమని మీరనుకుంటున్నారు. మనిషి మాత్రం... దీనిని ప్లాస్టిక్ యుగమని పేరుపెట్టుకున్నాడు.

ఏకధాటిగా మనసులోని మాటలన్నీ వెళ్ళగక్కి అమాయకంగా ముఖం పెట్టింది కవరు. బ్రహ్మ సుదీర్ఘ ఆలోచనలో పడ్డాడు. ఇదేదో కవరంత తేలికపాటి వ్యవహారమనుకున్నాడు. 'సమస్య మూలాలు మర్రి ఊడల్లా దిగిపోయాయన్నమాట' అనుకున్నాడు.

కవరుకు మోక్షం ఇవ్వాలంటే మనిషిని మార్చాలి. పూర్వంలా చేతి సంచులు, కాగితపు సంచులు వాడేలా చేయాలి. పర్యావరణస్పృహ పెంచాలి. ప్లాస్టిక్ ప్రమాదాలను గుర్తెరిగేలా చేయాలి. క్లోనింగ్ పేరుతో గొర్రెలు, ఆవులు, పిల్లులు,ఎలకల్ని పుట్టించాడు మనిషి. శిశువులనూ సృష్టిస్తున్నాడు. సృష్టికిప్రతి సృష్టి చేస్తూ నాకే పోటీగా మారాడు. మరి నే చెబితే వింటాడా? పరబ్రహ్మకే ఈ సమస్య బ్రహ్మపదార్థంలా తోచింది.

ఆలోచనా స్రవంతిని కొనసాగిస్తూ... మొన్న చంద్రుడిపై కాలుమోపాడు. ఇప్పుడు అంగారకుడిపై కన్నేశాడు. రేపు. సత్యలోకానికి రాకుండా ఉంటాడా ? ఈ మనుషులతో పెట్టుకోవడం అంత మంచిది కాదేమో !

చుబుకంపై వేలు పెట్టుకొని ఆకాశానికేసి చూస్తూ బ్రహ్మ ఆలోచిస్తున్నాడు. సరస్వతిని వెంట తెస్తే ........ తరుణోపాయం చెప్పేదేమో!.

"స్వామీ! నా సమస్యకు పరి ష్కారం..." అంటూ నసిగింది కవరు.

కవరుకు మోక్షం ఇవ్వలేను. ఇప్పటికిప్పుడు మనిషి మనసు మార్చలేను. ఇప్పుడెలా? ఇకపై సృష్టించే మనుషులకు మాత్రం సద్బుద్ధి ప్రసాదించవచ్చు. ప్లాస్టిక్ కవర్ల జోలికెళ్లకుండా చేయవచ్చు. ఇప్పటికే ముదిరిన మనుషులను ఏం చేయగలం?' అనుకున్నాడు బ్రహ్మ.

భవిష్యత్తు గురించి సరే! ఇప్పుడు ఈ కవరుకు నేనేం సమాధానం చెప్పాలి? మూడు తలలు బద్దలు కొట్టుకుంటున్నాడు బ్రహ్మ. "తండ్రీ ! నా సమస్యకు పరిష్కారం?"మళ్లీ నసిగింది కవరు. ఇంతలో చమక్!

చిన్న మెరుపు బ్రహ్మకు మంచి ఉపాయం తట్టింది. 'శభాష్! ఇదీ సమయస్ఫూర్తి అంటే...' అని మనసులో తనను తాను అభినందించుకున్నాడు బ్రహ్మ.

మెల్లగా మాట్లాడటం మొదలు పెట్టాడు.

"నీ కష్టాలు వింటుంటే హృదయం ద్రవిస్తోంది. గుండె కరుగుతోంది. మనసు నీరై కారుతోంది."

ఎక్కడో 'తేడా' వచ్చిందని కవరు గుర్తించింది. "దేవా! ఒకే మాటను మూడు రకాలుగా చెప్పారు. ఇంతకీ నా సమస్య పరిష్కారం..." ఈ సారి కొంచెం గట్టిగానే అడిగింది కవరు.

"వస్తున్నా! అక్కడికే వస్తున్నా... నేను సృష్టికర్తను. నా పని జీవం పోయడం. విష్ణువు స్థితి కారుడు. మహేశ్వరుడొక్కడే లయకారుడు. నీవు కోరుకుంటున్న 'శాశ్వతమైన చావు' ప్రసాదించడం ఆయన పని. నువ్వో చిన్న పొరపాటు చేశావు. నా బదులు పరమశివుడినే ప్రార్థించి ఉంటే బాగుండేది. శివుడు నీకు తప్పక మోక్షం ప్రసాదించేవాడు. పైగా... ఆయన చేతిలో పని. మా ముల్లోక ధర్మప్రకారం... ఆయన పని నేను చేయడం కుదరదు..." అని, అలవాటు ప్రకారం "దీర్ఘాయుష్మాన్‌భవ..." అంటూ కవరుకు మరోమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా, తిరిగి చూడకుండా బ్రహ్మ అదృశ్యమయ్యాడు.

కవరు హతాశురాలైంది. నోట మాటరాక మూగ పోయింది. మోక్షమెలాగూ ఇవ్వలేదు. పోతూ పోతూ ... దీర్ఘాయుష్మాన్‌భవ అని శపించడమెందుకంటూ మూగగా రోదించింది. సరే...బ్రహ్మ చెప్పినట్లు శివుడినే వేడుకుంటాను అంటూ... మళ్లీ మరో పెద్ద చెత్త కుప్పవైపు కదిలింది.

అంతలో ...సమీపంలో అడుగుల చప్పుడు. చిరిగిన షర్టు... మోకాళ్లకంటే కిందికి ప్యాంటు... చెదిరిన జుట్టు.. భుజం మీద వ్రేలాడుతున్న పెద్ద ప్లాస్టిక్ కవరును ఒడిసి పట్టాడు. టక్కున సంచిలో పడేసి... మరో కవరుకోసం ముందుకు కదిలాడు.

ఊరి చివర ఆలయం నుంచి ఘంటశాల పాడిన భగవద్గీత శ్లోకం ఒకటి వినిపిస్తోంది.

నైనం ఛిన్దన్తి శస్త్రాణి
నైనం దహతి పావకః
నచైనం క్లేదయన్త్యాపో
న శోషయతి మారుతః

"ఆత్మ నాశనము లేనిది. దానిని శస్త్రములు ఛేదిరించజాలవు. అగ్ని దహించజాలదు. నీరు తడపజాలదు. వాయువు ఆర్పివేయనూ శక్యము కాదు."

ఆత్మేకాదు. ప్లాస్టిక్ కవరు కూడా నాశనము లేనిది. దానిని శస్త్రములు ఛేదింప జాలవు. అగ్ని దహించజాలదు. నీరు తడపజాలదు. వాయువు ఆర్పివేయనూ శక్యము కాదు.

●●●

## భవిష్యద్దర్శనం

1. **సా**ధించదలచుకున్న లక్ష్యాన్ని, ముందుగా ఊహించటానికి నాయకుడు ఒక విజన్ ఏర్పరచుకోవాలి.
2. సాధించబోయే లక్ష్యానికి ఒక ప్రణాళిక వేసుకోవాలి. దానికి నాయకుడు తన బలాబలాలను అంచనా వేసుకుని, బలహీనతలను బలాలుగా మార్చుకోవాలి.
3. సభ్యులకు కొన్ని నిర్ణయాలు తీసుకునే హక్కునివ్వాలి. లక్ష్యం గురించి వారికి సంపూర్ణ అవగాహన కలిగించాలి.
4. సమర్థుడైన నాయకుడిగా పేరు తెచ్చుకోవాలంటే **1) లక్ష్య నిర్ణయం 2) తగిన నిర్ణయం, 3) చర్చలు - చర్యలు పై తగిన శ్రద్ధ తీసుకోవాలి.**
5. సమస్య వచ్చినపుడు పరిస్థితిని జాగ్రత్తగా విశ్లేషించాలి. అది ఎలా పరిష్కరించాలో పథకంవేసి, తగిన చర్య చేపట్టాలి.
6. భవిష్యత్తులో అనుకున్నది సాధించాలంటే నాయకుడికి, విమర్శను స్వీకరించే ధైర్యం ఉండాలి. స్వీకరించి ధైర్యంగా ప్రతిస్పందించాలి.
7. సంస్థ విజయం సాధించాలంటే నాయకుడు, సభ్యులందరినీ నమ్మాలి. వారిమీద అంతరంగికుల్ని నియమించి గూఢచర్యం చేయించకూడదు
8. విజన్ ఏర్పరచుకున్నాక, దానిని మూడు భాగాలుగా చేసి ఒక దాని వెంట ఒకటి విజయవంతం సాధించాలి.



# జన్మదిన శుభాకాంక్షలు

ఆంధ్ర మహాసభ ప్రధాన కార్యదర్శిగా స్వామి వివేకానంద
ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సంచాలకుడిగా, ఎస్. వి. క్లాసెస్
సంస్థాపకుడిగా, సామాజిక కార్యకర్తగా, అందరికీ అందుబాటులో ఉంటూ,
అండదండగా నిలుస్తూ, ఆధునిక ఉత్తుంగ భావతరంగాలను
పల్లవింపజేస్తున్న ఆత్మీయుడు... ఆజాతశత్రువు... **భోగ సహదేవ్**
గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు అందిస్తూ వారి
భావి జీవితం, సుఖసంతోషాలతో
అష్టయిశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో,
గడవాలనీ, విజయపథంలో నడవాలనీ
ఆకాంక్షిస్తున్నాం...

## శ్రేయోభిలాషులు.

మూల సిద్ధారెడ్డి, కె. బాస్కర్ రెడ్డి,
మర్రి జనార్ధన్, నడిమెట్ల యెల్లప్ప,
పి. గంగాధర్, దాస చంద్రకాంత్,
యెలిగేటి రాజ్‌కుమార్, అప్పారి
సత్యనారాయణ, సంగెవేని రవీంద్ర,
బింగి సత్యనారాయణ, గట్టు నర్సయ్య,
అనుమల్ల రమేశ్, వేముల మనోహర్,
ఏక్కల్‌దేవి కైలాష్,
సోమల్ రాజేశ్వర్ రావు,
భోగ సత్యపాల్, పేర్ల విఠల్,చిలివేరి
కృపానందం, గుద్దేటి గణేశ్,
భోగ సదానంద్.



## భోగ సహదేవ్

ఆంధ్ర మహాసభ ప్రధాన కార్యదర్శి

Advt.

# జరిగిన కార్యక్రమాల దర్పణం

**తేది 27/07/2008 ఆదివారం సా॥ 7 గం॥లకు.**

ఆంధ్ర మహాసభ ఆడిటోరియంలో సూపర్‌హిట్ సినిమా "బొమ్మరిల్లు" ప్రదర్శన జరిగింది. తండ్రికొడుకుల బాంధవ్యాన్ని ఆలోచనాత్మకంగా చిత్రించిన ఈ చిత్రం ప్రేక్షకుల్ని చాలా బాగా ఆకట్టుకొంది. పాటలు, సంగీతం, నటీనటుల చక్కటి అభినయం వెరిసి ఇంటిల్లిపాది ఆనందించిన సినిమా.

**తేది 29, 30/07/2008**

రెండు రోజుల పాటు మహిళా శాఖ అధ్వర్యంలో ఆటలపోటీలు చాలా ఉత్సాహంగా జరిగాయి.

**తేది 3/8/2008, ఉదయం 9.00గ॥ల నుండి**

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతోన్న అక్యుపంచర్ చికిత్స వెధానంతో, ఆంధ్ర మహాసభ ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డా॥ ఎస్. ఎస్. కమటం నిర్వహించిన ఈ శిబిరంలో సభ్యులు ఆసక్తిగా పాల్గొని అంక్యుపంచర్ విధానం పట్ల ఆకర్షితులయ్యారు.

ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా నివారణ కలిగించే అక్యుపంచర్ సర్వరోగ నివారిణిగా గుర్తింపు పొందుతోంది.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డా॥ కమటం



వివాహ వేదికలో పాల్గొన్న మహిళలు..

డా॥ కమటం తన బృందంతో ఎందరో పేషెంట్లకు పరీక్షలు నిర్వహించి మందులు సూచించారు. తర్వాత జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆంధ్ర మహాసభ పరిపాలన శాఖ ఉపాధ్యక్షులు మర్రి జనార్దన్ అధ్యక్షస్థానం వహించగా, ప్రధాన కార్యదర్శి భోగా సహదేవ్ నిర్వహణ బాధ్యతలు స్వీకరించారు.

డా॥ కమటం బృందానికి ఆంధ్ర మహాసభ వారు ఘన సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో దాస చంద్రకాంత్, నడిమెట్ల యెల్లప్ప, గట్టు నర్సయ్య, యెలిగేటి రాజ్‌కుమార్, పి.జి. గంగాధర్, బింగి సత్యనారాయణ, సోమల్ రాజేశ్వర్ రావు, అనుమల్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అదే రోజు సాయంత్రం మహిళా శాఖ అధ్వర్యంలో వివాహ వేదిక కార్యక్రమం జరిగింది.

**తేది 10/08/2008 సా॥ 6 గం॥లకు. విజ్ఞాన పీఠం**

ప్రముఖ సంచలనాత్మక రచయిత్రి దివంగత తెన్నేటి హేమలత(లత) సాహిత్యంపై ఆంధ్ర మహాసభలో సాహితీ గోష్ఠి నిర్వహించారు.

ప్రముఖ రచయిత్రి జలంధర ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో అన్ని సాహితీ ప్రక్రియలో సిద్ధహస్తుడైన



ఎం.బి.ఎస్. ప్రసాద్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్ చీఫ్ మేనేజర్ రాజేశ్వర్‌రావు ఆత్మీయ అతిథిగా వేదికనలంకరించారు.

భోగ సహదేవ్ స్వాగత వచనానంతరం డా॥ విజయసారధి కార్యనిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఎం.బి.ఎస్ ప్రసాద్ లత సాహిత్యం పై వివరంగా, విశ్లేషనాత్మకంగా, ఆమె బలహీనతలు, బలాలపై వివరంగా ప్రసంగించారు. లత సాహిత్యాన్ని మెచ్చినా మెచ్చకపోయినా నిర్లక్ష్యం చేయడం మాత్రం సాధ్యం కాదని వెల్లడించారు. లత సాహిత్యంపై సాంపుతి సురేంద్రనాధ్ మాట్లాడుతూ, ఆమె సాహిత్యం

చదవకపోయినా, ఆమె సాహిత్యం సృష్టించిన సంచలన ప్రకంపనాలు అనుభూతి చెందానినీ తెలిపారు.

బ్యానర్‌పై లత సాహిత్యంపై 'చర్చా...' అని చర్చకు దీర్ఘం పలకడంపై అసంతృప్తిని వ్యక్తం చేసాడు.



ప్రసంగిస్తున్న జలందర ప్రక్కన మూల సిద్ధారెడ్డి.

సంగెవేని రవీంద్ర, డా॥కె. రోహిణి ప్రసాద్, కిరణ్మయి, తురగా జయశ్యామల, తదితరులు ప్రసంగించారు.

ప్రముఖ గాయని పి. జగదీశ్వరి పాటరూపంలో లత సాహిత్యాన్ని గురించి తెలిపారు. ప్రధాన కార్యదర్శి భోగ సహదేవ్ మాట్లాడుతూ "మహాసభ తెలుగు సాహిత్యానికై నిరంతరం పాటుపడుతోందనీ. అన్నారు. అధ్యక్షులు మూల సిద్ధారెడ్డి మాట్లాడుతూ "లత సాహిత్యం, శ్రీశ్రీ సాహిత్యంపై కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ముంబయిలో తెలుగు సాహిత్యం పట్ల అభిరుచి పెరిగే అవకాశాలున్నాయనీ,అందుకే చిత్తశుద్ధితో యిలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మగ్రి జనార్ధన్, కె. భాస్కర్‌రెడ్డి, గట్టు నర్సయ్య, నడిమెట్ల యెల్లప్ప, ఓ. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



హాజరైన సాహిత్యాభిమానులు...

## తేది 15/08/2008 శనివారం, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్ర మహాసభలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. ఎం. శ్రీనివాస్, ఐ.ఆర్. ఎస్. ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థినీ విద్యార్థులు, కార్యవర్గ సభ్యులు, మహిళా శాఖ సమక్షంలో పతాకావిష్కరణ గావించారు. తర్వాత సభా ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. గుంటూరు జిల్లా, సత్తెనపల్లికి చెందిన 'పరివర్తన' సంస్థ వారి మూగ, బదిర మానసిక వికలాంగులైన విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యగాన కార్యక్రమాలు ప్రేక్షకులచే కంట తడి పెట్టించాయి.




పతకావిష్కరణ గావిస్తున్న ఎం. శ్రీనివాస్, ఐ.ఆర్.ఎస్.

వినలేని మాటాడలేని పిల్లలు, ప్రేక్షకుల్లో కూర్చొని మేడమ్ చేసే సైగలకనుగుణంగా నృత్యం చేయడం సభికుల్ని ఆశ్చర్యంలో ముంచింది. రిమోట్ తో కదిలే బొమ్మల్లా వాళ్లు నర్తిస్తుంటే ప్రతి ఒక్కరు కంటి తడిపెట్టుకున్నారు.

అభం శుభం తెలియని అ విధివంచితుల దీనగాధల్ని నిర్వాహకులు వివరిస్తుంటే శ్రోతల గుండెలు కరిగి చెరువయ్యాయి. కార్యక్రమానంతరం పిల్లలు ఆత్మీయ స్పర్శకై సభికుల దగ్గరకు వచ్చి మెరిసే కళ్లతో ధన్యవాదాలు



ముఖ్య అతిథిని సన్మానిస్తున్న కార్యవర్గం.


విద్యార్థిని సన్మానిస్తున్న ముఖ్య అతిథి

తెలుపుతుంటే, వారిని అక్కున చేర్చుకున్న పెద్దలు చలించిపోయారు. గుండెలు ద్రవించిన శ్రోతల హృదయాలు భారీ విరాళాలు ప్రకటించి మానవీయతకు అద్దం పట్టాయి. తర్వాత ఆంధ్ర మహాసభ 10వ,12వ తరగతుల్లో టాప్ టెన్‌గా నిలిచిన విద్యార్థులను షీల్డు, సర్టిఫికెట్‌తో సన్మానించి, నగదు బహుమతులు అందించారు.

75% కంటే అధికంగా మార్కులు సాధించిన విద్యార్థులందరినీ సర్టిఫకెట్, డిక్షనరీ బహుకరించి ప్రోత్సహించారు. మహాసభ అధ్యక్షులు మూల సిద్ధారెడ్డి వ్యక్తిగతంగా, పదవ, పన్నెండవ తరగతిలో ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ తెలుగు పాఠశాలల నుండి టాపర్‌గా నిలిచిన వారికి రూ॥ 5000/- చొప్పున నగదు బహుమతి అందించారు. రెండు శ్రేణుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఒక అమ్మాయికి కూడా అంతే మొత్తాన్నిచ్చి అమ్మాయిలను ప్రోత్సహించాలనే దృఢ సంకల్పాన్ని వ్యక్తంచేసారు.

తొలుత ప్రధానకార్యదర్శి భోగ సహదేవ్ గారు స్వాగతోపన్యాసం, ప్రార్థన గీతాల తర్వాత డా॥ విజయసారథి సాంస్కృతిక కార్యక్రమానికి సంచాలకుడిగా వ్యవహరించారు. నడిమెట్ల యెల్లప్ప ఆయనకు సహకరించారు. వేదిక కార్యక్రమాన్ని గట్టు నర్సయ్య నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మర్రి జనార్ధన్, కె. బాస్కర్ రెడ్డి, పి. గంగాధర్, ఓ. సుబ్రహ్మణ్యం, దాస చంద్రకాంత్, బింగి సత్యనారాయణ, యెలిగేటి రాజ్‌కుమార్, బదుగు విశ్వనాథ్, అప్పారి సత్యనారాయణ, సంగెవేని రవీంద్ర, అనుమల్ల రమేశ్, మహిళా శాఖ సభ్యులు, ట్రస్టీలు డా॥ వీరబత్తిని చంద్రశేఖర్, వినాయకరామరావు, తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ విద్యార్థులకు చెరి 501/- రూ॥లు నగదు బహుమతి యిస్తానని ప్రకటించిన సోమల్ రాజేశ్వర్‌రావు కనిపించక పోవడం కార్యవర్గాన్ని కలవరపరిచింది. వందన సమర్పణానంతరం అతిథులందరికి సురుచికర భోజనాన్ని వడ్డించారు.

కార్యక్రమ దృశ్యమాలిక









**తేది : 29/8/2008, శనివారం ఉ॥ 9.30గ॥లకు**

## వరలక్ష్మి వ్రతం

మహాసభ మహిళాశాఖ అధ్వర్యంలో 29 అగష్టు, శుక్రవారం ఉ॥9.30 గ॥ల నుండి వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. వ్రతానంతరం భక్తి సంగీత కార్యక్రమాలు ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎక్కువ సంఖ్యలో విచ్చేసారు. వారందరికీ భోజన ప్రసాదాలు ఏర్పాటు చేసారు. ప్రహ్లాదుని భక్తి, దృవుని పితృ భక్తి తదితర ఆదర్శనీయుల చరిత్రల్ని పఠించారు. శ్రీమతి పి. సుందరి ప్రవచనాలు అందరిని ఆకట్టుకున్నాయనీ మహిళాశాఖ అధ్యక్షురాలు టి.కమలకుమారి తెలియచేసారు.



**తేది : 31 /8/2008, ఆదివారం సా॥ 6.00గ॥ల నుండి - స్థానిక కళాకారుల ప్రతిభా పాటవాల ప్రదర్శన**

తెలుగు ప్రజల్లో ఉన్నంత కళ, ప్రజ్ఞా పాటవాలు, పట్టుదల మరెవరిలోనూ ఉండమని ప్రముఖ పారి శ్రామికవేత్త డాక్టర్ మేకా పాపారావు అన్నారు. దాదర్ ఆంధ్ర మహాసభలో ఆదివారం రాత్రి జరిగిన అమృత మహోత్సవ సావనీర్ ఆవిష్కరణ, తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమంలో పాపారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సావనీర్ ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలుగు ప్రజల్లో దాగి ఉన్న కళను వెలికి తీయాల్సిన అవసరం ఉందన్నారు. ఎందరో కళాకారులను తీర్చిదిద్దడంలో రోహిణీ ప్రసాద్ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ముంబయి తెలుగు ప్రజల్లో సంగీతం, కళలకు కొరత లేకుండా చేస్తున్నందుకు రోహిణీ ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. సన్మాన గ్రహీత గాయని రాధిక మాట్లాడుతూ తెలుగు భాషకు తెగులు రానీయవద్దని కోరారు. తెలుగు సాహిత్యం, సంగీత మేళవింపుతో మధురమైన పాటలతో భాషా దినోత్సవం జరుపుకోవడం సత్సంప్రదాయమన్నారు. సాహిత్యంతో కూడిన పాత పాటల్లోని మాధుర్యాన్ని ఇప్పటి పిల్లలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'మౌనంగా ఎద గమని మొక్క నీకు చెబుతుంది, ఎదిగిన కొద్దీ ఒదగమని ...' పాటను పాడి ఆహుతులను మురిపించారు. రాధిక సినిమాల్లో పాడిన అమలాపురం బుల్లోడా, బావలు సయ్యా, ఆట కావాలా పాట కావాలా అనే పాటలు పాడి అలరించారు.



సావనీరు ఆవిష్కరణ

మహాసభ అధ్యక్షుడు సిద్ధారెడ్డి భవిష్యత్తులో నిర్వహించే పలు కార్యక్రమాలను వివరిస్తూ వీటన్నించికీ ప్రజలు మద్దతు తెలుపుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మహాసభ ప్రధాన కార్యదర్శి సహదేవ్ మాట్లాడుతూ సాహిత్యం, సంగీతం కలసి కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గాయని రాధిక, పారిశ్రామిక వేత్త పాపారావు తదితరులను మెమొంటో, శాలువతో సత్కరించారు.

ఆంధ్ర మహాసభ మాజి ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రెడ్డి ప్రసంగిస్తూ వ్యవహీరిక భాష ప్రాధాన్యతను వివరించారు.



గానాలాపన చేస్తోన్న పి. జగదీశ్వరి బృందం

## తేది : 31 /8/2008, ఆదివారం సా॥ 6.00గ॥ల నుండి - స్థానిక కళాకారుల ప్రతిభా పాటవాల ప్రదర్శన



గాయని రాధికతో డా॥ రోహిణీ ప్రసాద్

వ్యవహారక భాషకు ప్రాచుర్యం తీసుకువచ్చిన గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళులు అర్పించారు. ప్రముఖ రచయిత్రి తురగా జయశ్యామల గిడుగు సేవలను కొనియాడారు. మాహసభ మాజీ అధ్యక్షుడు రమేశ్ బాబు తదితరులు ప్రసంగించారు. బీవోటీ చైర్మన్ రామ్మూర్తి, మహిళా శాఖ అధ్యక్షురాలు కమలకుమారి, రీహిణీ ప్రసాద్ తదితరులు వేదికను అలంకరించారు. ఆంధ్ర మహాసభ కల్చరల్ ఉపాధ్యక్షుడు కె. భాస్కర్ రెడ్డి, లిటరరీ జింఖానా ఉపాధ్యక్షుడు విజయసారథి కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్చరల్ జాయింట్ సెక్రటరీ గట్టు నర్సయ్య వందన సమర్పణ చేశారు.

తెలుగు చలన చిత్రసీమలో స్వర్ణయుగంగా భాసిల్లిన 1950-70 మధ్య కాలం నాటి మధుర పాటలతో ఏర్పాటు చేసిన గానలహరి కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. భోగా సహదేవ్ కాణిపాక వరసిద్ధి వినాయకుడి స్తోత్రంతో కార్యక్రమం మొదలైంది. నైజాం పాలకులను ఎండగడుతూ బండెనుక బండికట్టి పదహారు బండ్లు కట్టి అనే పాటను సహదేవ్, నర్సయ్య, నారాయణ బృందం ఆలపించారు. రోహిణీ ప్రసాద్ నేతృత్వంలో సాగిన గానలహరి కార్యక్రమంలో నగరంలోని 16 మంది ఔత్సాహిక గాయనీ గాయకులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు గిరిజ, ప్రసూన, భానుమతి, జగదీశ్వరి, సౌమ్య, పూర్ణిమ, సాయిలక్ష్మి మధుళిక, అపూర్వ, వంశీ, భావన రవికుమార్, మహదేవ్ శాస్త్రి తదితరులను, సత్కరించారు. చక్కటి వ్యాఖ్యానంతో సాయి లక్ష్మి సభను రక్తి కట్టించారు.

## సంతాపం





ఆంధ్ర మహాసభ జీవితకాల సభ్యులు, క్రీడాభిమాని, వివిధ క్రీడా సంస్థల పదాధికారి, ఆత్మీయుడు, సహృదయుడు "అశోక్ లోహార్" అకస్మిక గుండెపోటుతో తనకిష్టమైన క్రీడా మైదానంలోనే తుదిశ్వాస వదిలారు. వారు లేని చోటు ఎవరూ పూడ్చలేనిదనీ, క్రీడలకు, క్రీడాసంస్థలకు వారి మృతి తీరని లోటనీ మహాసభ కార్యవర్గం తీర్మానిస్తూ వారి ఆత్మకు భగవంతుడు శాంతికలిగించాలనీ ప్రార్థిస్తూ, వారి కుటుంబానికీ ప్రగాఢ సంతాపాన్ని తెలియా జేస్తున్నారు.

## కృతజ్ఞతలు






ఆంధ్ర మహాసభ మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ సాయి శంకర్ భండారి గారు ఆంధ్ర మహాసభ ప్రాంగణంలో నిర్వహించబడే "గణేశోత్సవాల"కు వినాయక విగ్రహాన్ని బహుకరించడమే గాకుండా, భజన కార్యక్రమాలు కూడా నిర్వహించేందుకు సమ్మతించినందుకు ఆంధ్ర మహాసభ వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతోంది.

## మనవి



**15**వ అగష్టు, స్వాతంత్ర దినోత్సవ వేడులకల సందర్భంగా ఆంధ్ర మహాసభ అధ్వర్యంలో సత్తెనపెల్లికి చెందిన మూగ, చెవిటి, మానసిక వికలాంగుల సంస్థ 'పరివర్తన' ప్రదర్శంచిన కార్యక్రమాల పట్ల స్పందించి స్వచ్ఛందంగా విరాళాలు ప్రకటించిన దాతలకు ధన్యవాదములు తెలుపుతూ, దయచేసి మీరు ప్రకటించిన విరాళాలు ఆంధ్ర మహాసభ కార్యాలయంలో అందజేయవల్సిందిగా మనవి చేస్తున్నాం.




VOLTAS LIMITED
A TATA Enterprise
DAIKIN
AIR CONDITIONING
HITACHI
Inspire the Next
LG

Mobile: 9987322236

Prop. :Vinay Kumar Anand

Summer King

Advt.



Air-Condition & Refrigeration engineers SALES, SERVICE, Hire & Repair

**ANNUAL MAINTENANCE CONTRACT**

All Type of Air Condition with Dautables

**SH-18, Plot No.1, Daulat Nagar, CHS.,**

**A/1B, Wing Link Rd. Extn. Santa Cruze, West Mumbai-400054**

# దర్పణం లో రేపటి కార్యక్రమాలు ...


**తేది : 20/9/2008, శనివారం సా॥6.00గ॥ల నుండి హరికథాకాలక్షేపం**



'**క**థాగాన విద్వాన్‌మణి', 'హరికథాగాన సుధాకర', 'హరికథారత్న' బిరుదాంకితులు, ప్రపంచవ్యాప్తంగా వేలాది హరికథాగాన సభలు నిర్వహించి అనన్యసామాన్యమైన కీర్తి ప్రతిష్ఠలు అందుకున్న "కొమ్ము సుబ్రహ్మణ్యవరప్రసాద్" గారిచే 'దక్షయజ్ఞం' కథాంశంపై హరికథాకాలక్షేపం నిర్వహిస్తున్నారు. ఆంధ్ర మహాసభ ప్రాంగణంలో ఆంధ్ర సంస్కృతికి దర్పణం పట్టే ఈ హరికథాకాలక్షేపం ముంబయి తెలుగు వారు చిరకాలం గుర్తుంచుకునేలా తీర్చిదిద్దేందుకు కార్యవర్గం తీవ్రంగా కృషి చేస్తోంది. ప్రపంచీకరణ ప్రభావం వల్ల మాయమవుతున్న సాంప్రదాయ కళలకు జీవం పోయాల్సిన యధార్థాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాల్సి ఉంది.

కొమ్ము సుబ్రహ్మణ్యవరప్రసాద్ గారు సుపరిచితులైన హరికథా గానకోవిదులు. శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద వారిచే, మాజీ గవర్నర్ ఎస్. రమాదేవిచే, జగద్గురు భారతీ తీర్థస్వామివారిచే సన్మానం పొందిన ఘనులు. దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు, సిడ్నీ, కాన్‌బెర్రా, మెల్‌బోర్న్‌లాంటి ప్రపంచనగరాల్లో కూడా తన ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమలో తెలుగు వారు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా మనవి.

**తేది : 21/9/2008, ఆదివారం సా॥6.00గ॥ల నుండి విజ్ఞానపీఠం**



**మా**రుతున్న తిండి, నిద్ర పనివేళల వల్ల నగర ప్రజల జీవన సరళి అతలాకుతలమైన సంగతి అందరికీ తెలిసిందే. క్షణం నిద్రపోని ముంబయి నగరం, రాత్రి పగలు మధ్యవ్యత్యాసాన్ని ఎప్పుడో తుడిచేసింది. పోటీనీ తట్టుకోలేక ఎదుటివాడి ప్రగతిని సహించలేక, వనరులు కరువై కొందరు, ఎక్కువై మరికొందరు మానసిక ప్రశాంతతతో పాటు నిద్రకు కూడా కరువవుతున్నారు. అట్లాంటి వారిలో సమస్యలపైసామాన్య జీవనంపై అవగాహన పెంచేందుకై నానావటి, మహావీర్, బ్రీచికాండి లాంటి హాస్పిటల్స్‌లో అసోషియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తోన్న డా॥ ప్రశాంత్ ఛాజెడ్ ద్వారా స్లీప్‌డిజార్డర్' అంశంపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుండి వృద్ధుల వరకు అందరికీ ఉపయోగకరమైన ఈ సదస్సులో భారీ సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కార్యవర్గం విన్నపం.



**తర్వాత**, పల్లె నుండి డిల్లీ దాకా ప్రతి తెలుగువాడు వల్లె వేసే వేమన పద్యాలపై సదస్సు జరుగుతుంది. నిజమైన ప్రజాకవి వేమన పద్యాల్ని గ్రామప్రాంతాల్లో ఒకప్పుడు అమ్మమ్మలు, తాతయ్యలు, నానమ్మలు, పిల్లల్ని ఒళ్ళో కూర్చోపెట్టుకొని నేర్పేవారు. సామాజిక రుగ్మతలపై వేటువేస్తూ, సామాజిక స్పృహను పెంచే వేమన పద్యాలు రాని తెలుగు వారెవరూ ఉండరు. వేమన కాలాన్ని గురించి నిర్దాష్ఠప్రమాణాలు దొరకక పోయినప్పటికీ 12 వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం మధ్యలో జీవించి ఉంటాడనీ పరిశీలకులు భావిస్తున్నారు. ఆ నాడు తాను రాసిన పద్యాలు ఈ

నాటి సమాజ స్థితిగతులకు అతికినట్లు ఉండడం. ఆయన సృజనాత్మకతకు, ముందుచూపుకు తార్కాణం. "వేమన పద్యాలు' సమకాలిన సమాజం పై ప్రభావం" అనే అంశంపై వేమన సాహిత్యంపై పరిశోదనలు గావించిన ఎస్. మహేశ్వరరావు గారి ప్రసంగం, తదంతరం చర్చా గోష్ఠి ఉంటుంది. ఈ గోష్ఠిలో ముంబయి రచయితలు భాషాభిమానులు, అందరూ పాల్గొన వచ్చు. పాత తరం వారికి గత స్మృతుల జీవిత అధ్యామాన్ని తిరిగి చదువుకొనే అవకాశమిది. అందరూ రండి! , పిల్లలతో సహా రండి!! వేమన పద్యాల్లోని మాధుర్యాన్ని, చక్కిలిగింతల్ని చురకల్ని. చురుపుల్ని అనుభూతి చెందండి !!

**తేది : 28/9/2008, ఆదివారం సా॥6.00 గ॥ల నుండి నాటక ప్రదర్శనలు...**



**మ**హాసభ ప్రాంగణంలో మొదటి సారిగా రెండు నాటక ప్రదర్శనలు ఒకేసారి నిర్వహిస్తున్నారు. సోమల్ రాజేశ్వర రావు ఓ. సుబ్రహ్మణ్యం గారి ప్రయాసలతో సామాజిక, వ్యంగనాటకం. "గుండెలు మార్చబడును" ప్రదర్శించనిర్ణయించారు ఇందులో మహాసభ సభ్యులు, కార్యవర్గ సభ్యులు, సోమల్ రాజేశ్వర్ రావు, నడిమెట్ల యెల్లప్ప, రావి సత్యం, ఎం. సత్యనారాయణ, అప్పారి సత్యనారాయణ, యు.ఎన్. శర్మ, ఎల్వీ లింబాద్రి, తదితరులు పాల్గొంటారనీ నిర్వాహకులు ప్రకటించారు.

**ఈ నాటక** ప్రదర్శనాంతరం, సునిశిత హాస్య నేపథ్యంతో "కాసింత ఉత్కంత, అనుకోని మలుపులతో సాగే సామాజిక నాటకం 'వైకుంతపాళీ' ప్రదర్శన ఉంటుంది. ఈ నాటకంలో ప్రముఖ సినీనటులు, నాటకరచయిత, నాటకదర్శకుడు, పత్రికా సంపాదకులు "రావి కొండల రావు" ప్రముఖ పాత్ర, నిర్వహిస్తున్నారు. వీరితోపాటు సినీ, టి.వి. నటీనటులు, శ్రీమతి రాధ, కోట శంకరరావు, అల్లు రమేశ్, అప్పారావు, అర గంధం, ప్రసాద్, శ్రీమతి దేవి తదితరులు నటిస్తున్నారు. కన్నుల పండుగగా సాగే ఈ నాటకాల ప్రదర్శనను వీక్షించేందుకు భారీ సంఖ్యలో తెలుగువారు పాల్గొని విజయవంతం చేయాలనీ మనవి.

Tel. : 2401 65 93, 3293 45 45.



# JYOTHI

## *Jewellery Mart*



**SOUTH INDIAN ORNAMENTS DESIGNER**



**20-E, MAHAVIR BUILDING,**
**BHANDARKAR ROAD, MATUNGA,**
**Mumbai - 400019.**

Advt.